ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888



పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888



Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -24 పేజీలు - 8 వెల - 03/- సోమవారం 11 మే 2026


# వికసిత తెలంగాణ బీజేపీ లక్ష్యం..




## పరేడ్ గ్రౌండ్ సభలో ప్రధాని మోదీ.. యుద్ధం నేపథ్యంలో ప్రజలకు సూచనలు

- ఇంటి నుంచి పని, ఆన్‌లైన్, వర్చువల్ భేటీలకు ప్రాధాన్యమివ్వాలి
- వంట నూనె తగ్గిస్తే దేశ సేవ.. దేహ సేవ.. విదేశాల్లో పెళ్లి, పర్యటనలొద్దు
- రసాయన ఎరువులొద్దు.. ప్రకృతి సాగే ముద్దు.. సౌర మోటార్లను వాడండి
- ఇతర దేశాల ఉత్పత్తులొద్దు.. విదేశీ మారక ద్రవ్యం ఆదా చేయడమూ దేశభక్తే
- బెంగాల్ ఉత్సాహం ఇక్కడా కనిపిస్తోంది.. తెలంగాణలోనూ వచ్చేది బీజేపీనే
- కాంగ్రెస్ మిగిలింది 3 రాష్ట్రాల్లోనే.. అబద్ధపు హామీలతో అధికారంలోకి
- కాంగ్రెస్ కాదది ఎంఎంసీ.. అంటే ముస్లింలీగ్ మావోవాది కాంగ్రెస్
- సింధు ఆస్పత్రిని ప్రారంభించిన మోదీ.. హెటిరో పార్థసారథిరెడ్డికి అభినందన



**హైదరాబాద్, మే 10, (రిపబ్లిక్ న్యూస్):**
యుద్ధాలతో ప్రపంచవ్యాప్తంగా ఆహారం, ఇంధనం, ఎరువుల ధరలు ఆకాశాన్నంటాయని.. భారత్‌పైనా తీవ్ర ప్రభావం పడుతోందని.. ఈ తరుణంలో దేశం కోసం మనందరం కొన్ని నిర్ణయాలు తీసుకోవాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు! పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించాలని.. మెట్రో రైలు సౌకర్యం ఉన్న నగరాల్లో ప్రజలుదాన్నిమిగతా2లో...

## అభివృద్ధిపై అందరం దృష్టి పెట్టాలి : సీఎం రేవంత్ రెడ్డి



తెలంగాణను నెంబరు వన్ చేయడమే తమ లక్ష్యమని.. తెలంగాణ అభివృద్ధికి మోడీ సహకారం కావాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.పీఎం మోడీ హైదరాబాద్ ఆదివారం హెచ్ఐసీసీలో ఏర్పాటు చేసిన సభలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంవోత్సవాలు చేశారు ప్రధాని మోడీ.ఈ సభకు సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. రాజకీయాలు పక్కనపెట్టి అభివృద్ధిపై అందరం దృష్టి పెట్టాలని సీఎం రేవంత్ అన్నారు. వికసిత్ భారత్ లక్ష్యం నెరవేరాలంటే తెలంగాణ కూడా అభివృద్ధి చెందాలని అన్నారు. ప్రధాని మోడీపై తెలంగాణ ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని అన్నారు. 2034 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ ఎకానమీ చేయడమే తన లక్ష్యమని అన్నారు. తెలంగాణ విజ్ఞప్తులను మోడీ వెంటనే పరిష్కరించాలని కోరారు.

## హోర్ముజ్ ప్రతిపాదనపై అనిశ్చితి

- ఇరాన్ స్పందన కోసం అమెరికా నిరీక్షణ
- పశ్చిమ ఆసియా శాంతి చర్చలు ముమ్మరం
- అమెరికా, ఇరాన్ ఘర్షణ చాలా క్లిష్టమైనది


**టెహ్రాన్:మే 10, (రిపబ్లిక్ న్యూస్):** పశ్చిమ ఆసియాలో రెండు నెలలకు పైగా కొనసాగుతున్న సంఘర్షణను ముగించేందుకు జరుగుతున్న దౌత్యపరమైన ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. శనివారం హోర్ముజ్ జలసంధి పరిసరాల్లో ఉద్రిక్తతలు స్వల్పంగా తగ్గిన సంకేతాలుమిగతా2లో...



## రాగల 48 గంటల్లో అల్పపీడనం

- ఏపీ తీరంపై వాతావరణ మార్పులు... రెండు రోజుల్లో అల్పపీడనం
- నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడే అవకాశం
- మన్నార్ గల్ఫ్ వద్ద కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం
- ఆంధ్రప్రదేశ్ తీర ప్రాతం వరకు విస్తరించిన వాతావరణ ద్రోణి

బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడటానికి పరిస్థితులు అనుకూలంగా మారుతున్నాయి. రాబోయే 48 గంటల్లో నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడన ప్రాంతం ఏర్పడే అవకాశం ఉందని ఐఎండీ అమరావతి వాతావరణ విభాగం అధికారులు తెలిపారు. మన్నార్ గల్ఫ్, దానిని ఆనుకుని ఉన్న శ్రీలంక పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతోనే ఈ అల్పపీడనం ఏర్పడనుందని పేర్కొన్నారు.మిగతా2లో...









# విజయ్ అను నేను..

## - తమిళనాడు సిఎంగా ప్రమాణ స్వీకారం

● తొమ్మిది మంది మంత్రులుగా ప్రమాణం ● రాహుల్ గాంధీ, పలువురు ప్రముఖులు హాజరు ● ఉచిత విద్యుత్‌కు తొలి సంతకం

**చెన్నై,మే 10, (రిపబ్లిక్ న్యూస్)::** తమిళనాడులో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా తమిళ వెట్రి కజగం (టివికె) అధినేత జోసెఫ్ విజయ్ ప్రమాణస్వీకారం చేశారు. చెన్నైలోని జవహరల్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో ఈ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఆదివారం ఉదయం పది గంటలకు జరిగిన ఈ కార్యక్రమంలో గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్.. విజయ్ చేత ప్రమాణస్వీకారం చేయించారు. విజయ్ ప్రమాణస్వీకారాన్ని మొదలు పెట్టగానే ఆయన అభిమానులు, టివికె కార్యకర్తలు, మద్దతుదారులు ఒక్కసారిగా కేరింతలు, చప్పట్లతో తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. విజయ్‌తో పాటు తొమ్మిది మంది ఎమ్మెల్యేలు కూడా మంత్రులుగా ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమానికి లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, విజయ్ తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులు, పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. టివికె కార్యకర్తలు, విజయ్ అభిమానులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమానికి తరలి రావడంతో ఇండోర్ స్టేడియంలో పండుగ వాతావరణం కనిపించింది. **ఉచిత విద్యుత్ ఫైలుపై తొలి సంతకం** సిఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత విజయ్ మూడు ముఖ్యమైన ఫైళ్లపై సంతకం చేశారు. ఉచిత విద్యుత్ ఫైల్‌పై మొదటి సంతకం చేశారు. ఈ మేరకు ఇళ్లకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందనుంది. మిగతా2లో...



# మిత్రులారా కుశలమా

## చంద్రబాబు ఇంటికి వెళ్లి గంటకుపైగా ప్రధాని మంతనాలు

## పవన్‌ను ఇంటికెళ్లి పరామర్శ

**హైదరాబాద్, మే 10, (రిపబ్లిక్ న్యూస్)::** ప్రధాని మోడీ ఎన్‌డిఎ మిత్రపక్షాలను మచ్చిక చేసుకుంటున్నారు. అందుకోసం ఏ చిన్న అవకాశాన్నీ వదులుకోవడం లేదు. అధికారిక పర్యటనల్లో కూడా సహజశైలికి భిన్నంగా వ్యవహరిస్తూ నేతల ఇళ్లకు వెళ్లి మరీ ప్రసన్నం చేసుకుంటున్నారు. ఆదివారం హైదరాబాద్ పర్యటనకు వచ్చిన ప్రధాని మోడీడ అధికారిక కార్యక్రమాల అనంతరం హైటెక్ సిటీ సమీపంలో తన కార్పొరేట్ మిత్రుడి ఆస్పత్రిని ప్రారంభించారు. అనంతరం జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నివాసానికి వెళ్లారు.మిగతా2లో...



ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888



# విజయ్ అను నేను..

(మొదటి పేజీ తరువాయి)

యాంటీ డ్రగ్ టాస్క్‌ఫోర్స్, మహిళల రక్షణకు 'సింగప్పన్' ర్యాపిడ్ రెస్పాన్స్ ఫోర్స్ ఫైళ్లపై కూడా విజయ్ సంతకాలు పెట్టారు. ఈ సందర్భంగా విజయ్ ఎంతో భావోద్వేగంతో ప్రసంగించారు. **గుర్తుంచుకోండి.. ఒక్క పైసా తినను** విజయ్ తన ప్రసంగంలో పలు కీలక విషయాలను ప్రస్తావించారు. తమిళనాడులో ప్రజాప్రభుత్వం వచ్చిందని చెప్పారు. సామాజిక, లౌకిక, న్యాయశకం మొదలైందని తెలిపారు. డైరెక్టర్ కుమారుడు నేడు సిఎం అయ్యాడనీ, తాను ఎన్నో కష్టాలు అధిగమించి ఈ స్థాయికి వచ్చానని విజయ్ చెప్పారు. తనను ఎంతో మంది ఎన్నో రకాలుగా ఇబ్బంది పెట్టారనీ, హామీల అమలుకు కొంత సమయం ఇవ్వాలని విజయ్ ఈ సందర్భంగా కోరారు. "గుర్తుంచుకోండి.. విజయ్ ఒక్క పైసా కూడా ప్రభుత్వ సొమ్ము తినడు. నాకు ఆ అవసరం లేదు. నేను తప్పు చేయను. నా చుట్టూ ఉన్నవారిని చేయనివ్వను" అని అన్నారు. విద్యార్థుల కోసం విజయ్ మామ అన్నీ మంచి పనులే చేస్తాడని ఆయన హామీ ఇచ్చారు. ఒక్కటే పవర్ సెంటర్ అని, అది విజయ్ అని చెప్పారు. ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతు ఇచ్చిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. **ప్రధాని సహా పలువురు శుభాకాంక్షలు** తమిళనాడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన టివికె అధ్యక్షుడు సి. జోసెఫ్ విజయ్ కు ప్రధాని నరేంద్రమోడీసహా పలువురు నేతలు అభినందనలు తెలిపారు. విజయ్ పరిపాలన అద్భుతంగా సాగాలని, కేంద్ర ప్రబుత్వం తరపున పూర్తిస్థాయి సహకారాన్ని అందిస్తామని ఎక్స్ లో పేర్కొన్నారు. **సిపిఎం అభినందనలు** సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ బేబి ఆదివారం ఎక్స్ వేదికగా సిఎం విజయ్ కు అభినందనలు తెలిపారు. "తమిళనాడు ముఖ్యమ ంత్రిగా బాధ్యతలు చేపట్టిన తమిళగ వెట్రి కజగం (టివికె) అధ్యక్షుడు తిరు సి. జోసెఫ్ విజయ్ కు అభినందనలు. లౌకికవాదం, ప్రజా సంక్షేమం, సమాఖ్యవాదం, సామాజిక న్యాయం సూత్రాలను నిలబెడుతుందని, తమిళనాడు ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తుందని ఆశిస్తూ.. మీకు, మీ ప్రభుత్వానికి శుభాకాంక్షలు " అని పేర్కొన్నారు. **ప్రారంభంలో 'తమిళ మాతృవందనం' సాంప్రదాయం కొనసాగుతుంది: మంత్రి ఆథవ్ అర్జున** తమిళనాడులో, 'తమిళ తాయ్ వాళ్తు'ను మూడవ గీతంగా ఆలపించడం టివికె నేతృత్వంలోని తమిళనాడు ప్రభుత్వానికి ఆమోదయోగ్యం కాదని మంత్రి అధవ్ అర్జున్ పేర్కొన్నారు. ప్రారంభంలో తమిళ తాయ్ వాళ్తు పాడాలని గవర్నర్ కార్యాలయాన్ని కోరామని, కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఒక కొత్త సర్క్యులర్ ప్రకారం నడుచుకోవాల్సిన బాధ్యత గవర్నర్‌పై ఉందని తమకు తెలియజేశారని తెలిపారు. అధికారిక కార్యక్రమాల ప్రారంభంలో 'తమిళ తాయ్ వాళ్తు' (తమిళ మాతృ వందనం), చివరలో జాతీయ గీతం ఆలపించే సంప్రదాయాన్ని కొత్త ప్రభుత్వం కొనసాగిస్తుందని తమిళనాడు మంత్రి ఆథవ్ అర్జున ఆదివారం ఎక్స్ లో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని మంత్రివర్గ ప్రమాణ స్వీకారంలో మొదట 'వందేమాతరం', ఆ తర్వాత జాతీయ గీతం, చివరగా 'తమిళ తాయ్ వాళ్తు' ఆలపించిన నేపథ్యంలో మంత్రి ఆథవ్ అర్జున ఈ ప్రకటన చేశారు. **టీవీకే మంత్రులు :** ఎన్. ఆనంద్ (టి. నగర్ నియోజకవర్గం) ఆథవ్ అర్జున (విల్లివాక్కం) కె.జి. అరుణ్‌రాజ్ (తిరుచెంగోడు) కె.ఎ. సెంగోట్టయన్ (గోబిచెట్టిపాళయం) పి. వెంకటరమణన్ (మైలాపూర్) సి.టి.ఆర్. నిర్మల్‌కుమార్ (తిరుప్పరంకుండ్రం) ఎ. రాజ్మోహన్ (ఎగ్మోర్) టి.కె. ప్రభు (కరైకుడి) ఎస్. కీర్తన (శివకాశి)

# మిత్రులారా కుశలమా

**(మొదటి పేజీ తరువాయి)**ప్రధాన ద్వారం వద్ద చంద్రబాబు దంపతులు, మంత్రి లోకేశ్‌ మోడీకి సంప్రదాయబద్ధంగా ఘన స్వాగతం పలికారు. చంద్రబాబు కుటుంబ సభ్యులను పలకరించి కుశల ప్రశ్నలు అడిగిన మోడీ చంద్రబాబుతో కలిసి అల్పాహారాన్ని స్వీకరించారు. అనంతరం ఇరువురు సుమారు గంటకుపైగా పలు అంశాలపై చర్చించుకున్నారు. ఎన్నికల్లో ఎన్‌డిఎ మిత్రపక్షాల సహకారం, పశ్చిమ బెంగాల్‌లో బిజెపి అనుసరించిన రాజకీయ వ్యూహాలను మోడీ చంద్రబాబు వద్ద ప్రస్తావించినట్టు సమాచారం. తమిళనాడులో విజయ్ పార్టీకి వచ్చిన ప్రజాదరణపై కూడా చర్చ జరిగింది. ప్రధానంగా దక్షిణాదిలో ఎన్‌డిఎ బలం పెంచుకోవడంతోపాటు స్వతంత్రంగా ఉన్న ప్రాంతీయ పార్టీలకు ఏవిధంగా గాలం వేయాలనే దానిపై కూడా ఇరువురు సమాలోచనలు చేసినట్లు సమాచారం. తెలంగాణలో టిడిపి బలం గతంలో కంటే మెరుగుపడిందని, తెలంగాణలో బిజెపికి ప్రజాదారణ పెరుగుతోందని, ఇకపై తెలంగాణపై దృష్టి కేంద్రీకరిస్తామని, అందుకు సహకరించాలని చంద్రబాబుని మోడీ కోరినట్టు తెలిసింది. బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి తిరుగులేని ప్రజాదరణ పొంది ప్రభుత్వాలను ఏర్పాటు చేసిందంటూ మోడీకి చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయాలు, ప్రభుత్వ ప్రాధాన్యాలను మోడీకి వివరించారు. కీలక ప్రాజెక్టులపై మాట్లాడేందుకు త్వరలో ఢిల్లీ వస్తానని తెలిపారు.అంతకు ముందు జూబ్లీహిల్స్‌లోని ఉప ముఖ్యమంత్రి, జనసేన చీఫ్ పవన్ కల్యాణ్ ఇంటికి మోడీ వెళ్లారు. ఆయనకు పవన్ కల్యాణ్, ఆయన కుటుంబసభ్యులు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్‌తో భేటీ అయిన మోడీ పవన్ ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు. సైనస్ సమస్య కారణంగా మైక్రోసర్జరీ జరిగిందని, వైద్యుల సూచన మేరకు విశ్రాంతి తీసుకుంటున్నానని పవన్ తెలిపారు. తమపై అభిమానంతో ఇంటికి వచ్చినందుకు మోడీకి పవన్ కల్యాణ్ దంపతులు ధన్యవాదాలు తెలిపారు. త్వరలోనే మళ్లీ కలుద్దామని చెప్పిన మోడీ అక్కడ నుంచి చంద్రబాబు ఇంటికి వెళ్లారు. అనంతరం ప్రధాని అక్కడ నుంచి నేరుగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌కు బయల్దేరి చేరుకున్నారు. మోడీ పర్యటన నేపథ్యంలో జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, హైటెక్ సిటీ ప్రాంతాల్లో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

# వికసిత తెలంగాణ బీజేపీ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

వినియోగించుకోవాలని.. కారులో వెళ్లాల్సి వస్తే కార్ పూల్ చేసి ఇతరులనూ తీసుకెళ్లాలని సూచించారు. ఏడాదిపాటు ఎవరూ బంగారం కొనొద్దని.. విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేయాలని హితవు పలికారు. వస్తు రవాణా కోసం రైలు సేవలు వినియోగించుకోవాలన్నారు. రైళ్లు కరెంటుతో నడుస్తాయి కాబట్టి వాటికి పెట్రోల్, డీజిల్ అవసరం ఉండదని గుర్తుచేశారు. ఇరాన్ యుద్ధం మొదలయ్యాక ప్రధాని మోదీ ఇంధనం, ఎరువుల కొరతతోపాటు యుద్ధం వల్ల కలుగుతున్న పలు సమస్యలపై బహిరంగంగా ప్రస్తావించి, ప్రజలకు జాగ్రత్తలు చెప్పడం ఇదే తొలిసారి. రాష్ట్రపర్యటనలో ఉన్న ఆయన.. ఆదివారం సాయంత్రం పరేడ్ గ్రౌండ్స్‌లో పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగసభలో పాల్గొని ప్రసంగిస్తూ ఈ జాగ్రత్తలు చెప్పారు. "నా ప్రియమైన తెలంగాణ ప్రజలారా.. మీ అందరికి హృదయపూర్వక శుభాకాంక్షలు" అంటూ తెలుగులో ప్రసంగం ప్రారంభించిన మోదీ.. రాజకీయ విమర్శలు చేయడంతోపాటు, దేశ ప్రజలకు పలు కీలక సూచనలు చేశారు.

కరోనా, రష్యా-ఉక్రెయిన్ యుద్ధంతో సమస్యలు పెరిగాయని.. అయినప్పటికీ వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఒక యూరియా బస్తా అంతర్జాతీయంగా రూ. 3వేల ధర ఉంటే.. భారత్‌లో అదే రూ. 300 కంటే తక్కువగా వస్తోందని గుర్తుచేశారు. అయితే, మన చుట్టుపక్కల జరుగుతున్న (ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్) యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న పరిస్థితుల కారణంగా సమస్యలు మరింతగా పెరిగాయని ఆందోళన వెలిబుచ్చారు. "యుద్ధ ప్రభావం మనపై తీవ్రంగా పడుతోంది. మనవద్ద పెట్రోల్ బావులు లేవు. ఇతర దేశాలపై ఆధారపడుతున్నాం. యుద్ధంతో ప్రపంచం అంతా పెట్రోలు, ఎరువుల ధరలు ఆకాశాన్నంటాయి. ఈ సమస్య నుంచి ప్రజలను కాపాడేందుకు నిరంతరం కృషి చేస్తున్నాం. ప్రజలపై భారం వేయకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వమే భరిస్తోంది. సరఫరా గొలుసు (సప్లై చైన్ల) ఇబ్బందులతో.. విదేశీమారక ద్రవ్యం ఎక్కువగా ఖర్చవుతోంది. దీనిపై మనమంతా కలిసి పోరాడాలి. దేశం కోసం ప్రాణాలు ఇవ్వడమే దేశభక్తి కాదు.. దేశం కోసం బతకడం, దేశ కర్తవ్యం కోసం పాటుపడటం కూడా దేశభక్తే" అని ఆయన పేర్కొన్నారు.

### నూనె తగ్గించడమూ..

పెట్రోల్, డీజిల్ వినియోగం తగ్గించాలంటే.. వర్క్ ఫ్రం హోమ్, ఆన్‌లైన్, వర్చువల్ మీటింగ్‌లకు ప్రాధాన్యమివ్వాలని ప్రధాని సూచించారు. అలాగే.. విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేసుకునేందుకు అన్ని ప్రయత్నాలూ చేయాలన్నారు. మంచి నూనె, బంగారం వంటివాటి కొనుగోలుకు విదేశీ మారక ద్రవ్యం ఎక్కువగా ఖర్చవుతోందని గుర్తుచేశారు. "మంచి నూనె వాడకం తగ్గించినా అది దేశభక్తి అవుతుంది. దేశసేవతోపాటు దేహ సేవ. దీంతో దేశ ఆర్థికవ్యవస్థతోపాటు కుటుంబ ఆరోగ్యం కూడా మెరుగవుతుంది" అని వ్యాఖ్యానించారు. "గతంలో యుద్ధం వచ్చినప్పుడు, ఏదైనా సంకటం వచ్చినప్పుడు ప్రజలు దేశం కోసం బంగారం ఇచ్చేవారు. ఇప్పుడలా బంగారం దానం చేయాల్సిన అవసరం లేదుగానీ.. దేశ ప్రయోజనాల నిమిత్తం ఏడాది వరకూ.. ఇంట్లో ఏ శుభకార్యమైనా సరే.. బంగారం కొనకూడదని నిర్ణయం తీసుకోండి. దీంతో విదేశీ మారక ద్రవ్యం ఆదా అవుతుంది" అని సూచించారు. గతంలో మన దేశం రాగిని ఎగుమతి చేసేదని.. ఇప్పుడు దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ధర్నాలు, ఆందోళనలతో కాపర్ ప్లాంట్లు మూతపడడమే అందుకు కారణమన్నారు. ఇప్పుడు రాగి దిగుమతుల కోసం విదేశీ మారకద్రవ్యాన్ని ఎక్కువగా వినియోగించాల్సి వస్తోందన్నారు. విదేశాల్లో పెళ్లిళ్లు, పర్యాటకాన్ని ఏడాదిపాటు వాయిదా వేసుకోవాలన్నారు. దేశంలో పర్యాటక ప్రాంతాలు చాలానే ఉన్నాయని.. ఇక్కడ కూడా పర్యటించవచ్చని పేర్కొన్నారు.

### స్థానిక ఉత్పత్తులే కొనండి..

"మనం వ్యవసాయం కోసం రసాయన ఎరువులు వాడుతున్నాం. దీంతో భూమాత ఇబ్బంది పడుతోంది. ఇప్పుడు భూమిని కాపాడుకోకుంటే భవిష్యత్తులో మరిన్ని కష్టాలు వస్తాయి. అందుకే రసాయన ఎరువుల వినియోగం 50 శాతానికి తగ్గించాలి. ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లాలి. దీంతో మనం విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేయడంతోపాటు భూమాతనూ కాపాడుకోగలం. అలాగే.. పొలాల్లో డీజిల్ పంప్ స్థానంలో సౌరవిద్యుత్తు మోటార్లు వాడాలి" అని ప్రధాని పిలుపునిచ్చారు. అలాగే స్థానిక ఉత్పత్తులు వినియోగించి విదేశీ మారక ద్రవ్యాన్ని కాపాడాలన్నారు. "ఇప్పుడు వినియోగిస్తున్న విదేశీ వస్తువులు పారవేయమని చెప్పను. కానీ, కొత్తగా విదేశీ వస్తువులు కొనద్దు. మనం నిత్యం వినియోగించే వస్తువుల్లో చాలావరకూ విదేశాల నుంచి వచ్చేవేనని చాలామందికి తెలియదు. ఇంటికి ఉపయోగించే వస్తువుల జాబితా తయారుచేయండి. కత్తెర, టూత్ పేస్ట్.. ఇలా ఎన్నో వస్తువులున్నాయి. వాటన్నింటి విషయంలో స్వదేశీ ఉత్పత్తులకు మారండి. ప్రతి పౌరుడూ నిజాయతీతో వ్యవహరిస్తే దేశ అభివృద్ధి" అని ప్రధాని స్పష్టం చేశారు.

### రాష్ట్రాభివృద్ధే లక్ష్యం..

రాష్ట్ర అభివృద్ధితోనే దేశ అభివృద్ధి సాధ్యమని ప్రధాని మోదీ తేల్చిచెప్పారు. తెలంగాణను, హైదరాబాద్‌ను అభివృద్ధి చేయడం ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యమని.. అందులో భాగంగానే రూ.వేల కోట్ల పనులకు తాను శంకుస్థాపనలు చేశానని గుర్తుచేశారు. "దేశంలోని 14 పారిశ్రామిక కారిడర్లలో ఇక్కడ ఒకటి వస్తుంది. జహీరాబాద్ పారిశ్రామిక ప్రాంతంతో స్థానిక రైతులు, యువతకు కొత్త ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. దేశంలో 7 పీఎం టెక్స్‌టైల్ పార్క్‌లలో ఒకటి వరంగల్ కాకతీయ పార్క్. దాంతో లక్షల ఉద్యోగాలొస్తాయి. అక్కడి రైతులకు లబ్ధి కలగనుంది. వేల కోట్ల రూపాయల కేంద్ర ప్రోత్సాహక నిధులతో వరంగల్ పత్తి రైతులకు లాభం కలగనుంది. ఇక దిగుమతులపై ఆధారపడే అవసరం ఉండదు" అని ఆయన పేర్కొన్నారు.

### తెలంగాణలోనూ బీజేపీ..

"అసోంలో గతంలో కొద్దిమంది మాత్రమే బీజేపీ ఎమ్మెల్యేలు ఉండేవారు. కానీ ఇప్పుడక్కడ వరుసగా మూడోసారి విజయంతో హ్యాట్రిక్ కొట్టాం. పదేళ్ల క్రితం 3 ఎమ్మెల్యే సీట్లున్న బెంగాల్‌లో ఇప్పుడు 200కి పైగా సాధించి తొలిసారి అధికారం చేపట్టాం. ఇప్పుడు ఇక్కడి (తెలంగాణలో) బీజేపీ కార్యకర్తల ఉత్సాహం చూస్తుంటే.. వచ్చే ఎన్నికల్లో ఇక్కడ వచ్చేది బీజేపీ సర్కారే అని స్పష్టమవుతోంది" అని ప్రధాని వ్యాఖ్యానించారు. దేశం మొత్తంలో ఒకప్పుడు బీజేపీ కేవలం రెండే రెండు సీట్లు గెలిస్తే.. అందులో ఒకటి తెలంగాణ నుంచి గెలిచిందేనని గుర్తుచేశారు. "అప్పటి నుంచే బీజేపీకి ఇక్కడి ప్రజలు మద్దతు పలుకుతున్నారు.. ఇక్కడి కుటుంబ రాజకీయాలతో ప్రజలు విసుగెత్తిపోయారు.. బీజేపీ కోసం ఎదురుచూస్తున్నారు.. అగ్లీ బార్.. మోదీ సర్కార్.. (వచ్చేసారి మోదీ సర్కారు)" అని నినదించారు. శనివారం తాను బెంగాల్‌లో ఉన్నానని.. అక్కడ కనిపించిన విజయోత్సాహం తెలంగాణలోనూ కనిపిస్తోందని ఆనందంగా చెప్పారు. "కాంగ్రెస్ అవినీతిని, కుటుంబ రాజకీయాలను ప్రోత్సహించింది. రాజ్యంగబద్ధ సంస్థలను దుర్వినియోగం చేసింది. ఆ పార్టీ నుంచి టీఎంసీ అన్ని దురలవాట్లనూ నేర్చుకుని మరిన్ని తప్పులు చేసింది. ప్రజలను బేడీలతో బంధించింది. అక్కడ బీజేపీ.. టీఎంసీ ఏకఛత్రాధిపత్యాన్ని ఓడించింది. ఎన్నో ఏళ్ల తర్వాత అక్కడి ప్రజలు నిర్భయంగా ఊపిరి పీల్చుకుంటున్నారు" అని వివరించారు. దేశవ్యాప్తంగా బీజేపీ సాధిస్తున్న విజయాలు కేవలం రాజకీయ విజయాలు కాదని.. దేశంలో వస్తున్న మార్పునకు సంకేతమని.. ప్రజలు ఇప్పుడు కుటుంబ రాజకీయాలను తిరస్కరిస్తున్నారని ప్రధాని స్పష్టం చేశారు.

### కాంగ్రెస్ వల్లే మావోయిస్టుల అంతం ఆలస్యం..

దేశంలో కేవలం 3 రాష్ట్రాల్లోనే కాంగ్రెస్ సీఎంలు ఉన్నారని ప్రధాని గుర్తుచేశారు. అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చాక.. ఇచ్చిన హామీలను మరచిపోవడం కాంగ్రెస్ కు అలవాటైపోయిందని దుయ్యబట్టారు. "హిమాచల్ ప్రదేశ్, కర్ణాటకలో ఇచ్చిన హామీలన్నీ మరిచారు. తెలంగాణలోనూ అంతే. కాంగ్రెస్ వామపక్షాలను మించిన మావోయిస్టుగా.. ముస్లింలీగ్ కంటే ఎక్కువ ముస్లింలీగ్‌గా మారింది. అందుకే కాంగ్రెస్ ను ఎంఎంసి.. ముస్లిం లీగ్, మావోవాదీ కాంగ్రెస్ గా పేర్కొంటున్నారు" అని ధ్వజమెత్తారు. కాంగ్రెస్, వామపక్షాల మద్దతుతోనే తెలంగాణలో మావోయిస్టులు పెరిగారని.. ఇప్పుడు వారు చివరిశ్వాస తీసుకుంటుంటే, కాపాడేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. తెలంగాణ పోలీసులకు స్వాతంత్రం ఇచ్చి ఉంటే.. మావోయిస్టుల అంతం ఎప్పుడో అయ్యేదన్నారు. కానీ ఇక్కడ సహకారం లభించలేదని.. అందుకే మావోయిస్టుల అంతం ఆలస్యమైందని.. నేడు తెలంగాణ మావో విముక్త రాష్ట్రంగా మారిందని పేర్కొన్నారు.

### మీ చిరునామా ఇవ్వండి.. ఉత్తరం రాస్తా

ప్రధాని ప్రసంగించే సమయంలో.. సభకు వచ్చిన పలువురు ఆయన చిత్రపటాలు ప్రదర్శించారు. వారంతా ఆయన్ను చూసేందుకు ముందుకు వస్తుండడంతో ప్రధాని తన ప్రసంగాన్ని ఆపి.. "దయచేసి ముందుకు రావద్దు.. చేతులు జోడించి నమస్కరిస్తున్నా. నాకోసం తెచ్చిన చిత్రాలు ప్రదర్శించవద్దు. కింద పెట్టేయండి. వెనకవారికి కనిపించడం లేదని జనం అరుస్తున్నారు. పోస్టర్లు, జెండాలు కింద పెట్టండి" అని విజ్ఞప్తి చేశారు. ఆ చిత్రపటాలను ఎస్పీజీ సిబ్బంది తీసుకుంటారని చెప్పారు. "వాటి వెనుక మీ చిరునామా ఉంటే నేను ఉత్తరం రాస్తా" అని నచ్చజెప్పారు. "మీ ప్రేమ నాపై ఉంటుంది. మీరు కురిపిస్తున్న ప్రేమ నా అదృష్టం. మీరు కాస్త శాంతిస్తే నేను నా ప్రసంగం కొనసాగిస్తాను" అని ప్రధాని విజ్ఞప్తి చేశారు.

## హోర్ముజ్ ప్రతిపాదనపై అనిశ్చితి

(మొదటి పేజీ తరువాయి)

కనిపించాయి. ఈ సంఘర్షణను అంతం చేసే లక్ష్యంతో అమెరికా ముందుకు తెచ్చిన కొత్త శాంతి ప్రతిపాదనపై ఇరాన్ స్పందన కోసం అంతర్జాతీయ సమాజం ఇప్పుడు నిశితంగా గమనిస్తోంది. వాషింగ్టన్ ప్రతిపాదనకు ఇరాన్ త్వరలోనే స్పందిస్తుందని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఆశాభావం వ్యక్తం చేసినప్పటికీ, టెహ్రాన్ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ధృవీకరణ రాలేదు. ఈలోగా, పశ్చిమ ఆసియాలో ప్రాంతీయ భద్రత, దీర్ఘకాలిక స్థిరత్వంపై చర్చించేందుకు రూబియో మయామిలో మహమ్మద్ బిన్ అబ్దుల్‌రహ్మాన్ అల్ థానీతో సమావేశమయ్యారు. ఒక ముఖ్యమైన పరిణామంలో, ఖతార్ నుంచి పాకిస్థాన్‌కు వెళ్తున్న ఒక ఎల్‌పిజి గ్యాస్ ట్యాంకర్ శనివారం హోర్ముజ్ జలసంధి గుండా ప్రయాణించింది. సంఘర్షణ ప్రారంభమైనప్పటి నుంచి ఇలా జరగడం ఇదే మొదటిసారి.

మధ్యవర్తిత్వ ప్రయత్నాల్లో పాలుపంచుకుంటున్న దేశాలతో విశ్వాసాన్ని నిలబెట్టుకునే ప్రయత్నంలో భాగంగానే ఇరాన్ ఈ ప్రయాణానికి అనుమతి ఇచ్చిందని నివేదికలు సూచిస్తున్నాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మరియు ఇంధన మార్కెట్లపై దీని ప్రభావం పెరుగుతున్నందున, ఈ సంఘర్షణను ముగించాలని అన్ని పక్షాలపై ప్రపంచవ్యాప్తంగా ఒత్తిడి పెరుగుతోంది. శాంతి చర్చలు కొనసాగుతున్నప్పటికీ, ఈ ప్రాంతంలో చెదురుమదురు ఘర్షణలు జరుగుతున్నట్లు నివేదికలు వస్తున్నాయి. ఇరాన్ ఓడరేవులోకి ప్రవేశించడానికి ప్రయత్నిస్తున్న రెండు నౌకలను అమెరికా యుద్ధ విమానాలు అడ్డగించి వెనక్కి పంపినట్లు ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు, శుక్రవారం ఇరాన్ నుండి ప్రయోగించిన క్షిపణులు , డ్రోన్‌లను తాము అడ్డుకున్నామని, ఈ దాడిలో ముగ్గురు గాయపడ్డారని యూఏఈ పేర్కొంది.

**అమెరికా నౌకలపై క్షిపణులు గురిపెట్టాం దాడులు చేస్తే తీవ్ర ప్రతీకారం : ఐఆర్‌జీసీ వార్నింగ్**ఇరాన్ చమురు ట్యాంకర్లు, వాణిజ్య నౌకలపై ఎలాంటి దాడి జరిగినా పశ్చిమాసియా అమెరికా స్థావరాలపై, శత్రు నౌకలపై భారీ ప్రతిదాడి ఉంటుందని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ (ఐఆర్ జీసీ) నావికాదళం హెచ్చరించింది. శుక్రవారం రెండు ఇరాన్ చమురుట్యాంకర్లపై అమెరికా దాడి చేసిన నేపథ్యంలో ఇరాన్ ప్రభుత్వ టీవీ ద్వారా నౌకాదళం ఈ హెచ్చరిక చేసింది. అయితే ఇరాన్ ఓడరేవుల వద్ద తాము విధించిన దిగ్బంధనాన్ని ఉల్లంఘించేందుకు యత్నించిన రెండు ఇరాన్ ట్యాంకర్లను శుక్రవారం నిలిపివేసినట్టు అమెరికా సైన్యం తెలిపింది. దానికి కొన్నిగంటల ముందు మూడు యుద్ధనౌకలపై దాడులను తిప్పికొట్టామని పేర్కొంది. జలసంధిలోని ఇరాన్ సైనిక స్థావరాలపై దాడులు చేశామని అమెరికా సైన్యం వెల్లడించింది. యుద్ధం ముగించడానికి అమెరికా చేసిన ప్రతిపాదనలపై ఇరాన్ స్పందన కోసం ట్రంప్ సర్కార్ ఎదురుచూస్తోంది. హోర్ముజ్ జలసంధిని తెరవాలని టెహ్రాన్ అణు కార్యక్రమం నిలిపివేయాలనే అంశాలపై టెహ్రాన్‌కు అమెరికా కొన్ని ప్రతిపాదనలు చేసింది. వీటిపై ఇరాన్ ఇంకా అధికారికంగా స్పందించలేదు. మరోవైపు సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారని త్వరలోనే ప్రజల ముందుకు వస్తారని ఇరాన్ ఉన్నతాధికారి చెప్పారు. యుద్ధం ప్రారంభంలో జరిగిన దాడుల్లో మొజ్తబా మోకాలు, వెన్నుకు గాయాలు అయ్యాయని అవి చాలావరకు నయమయ్యాయని తెలిపారు

## రాగల 48 గంటల్లో అల్పపీడనం

**(మొదటి పేజీ తరువాయి)**ప్రస్తుతం ఈ ఉపరితల ఆవర్తనం సముద్ర మట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి స్థిరంగా కొనసాగుతోంది. ఇది మరింత బలపడి అల్పపీడనంగా మారే అవకాశం ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.మరోవైపు, మధ్య, ఎగువ స్థాయి పశ్చిమ గాలుల్లో కొనసాగుతున్న ద్రోణి కోస్తాంధ్రపై ప్రభావం చూపుతోంది. సగటు సముద్ర మట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న ఈ ద్రోణి... ఈశాన్య బీహార్ నుంచి జార్ఖండ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ మీదుగా తీరప్రాంత ఆంధ్రప్రదేశ్‌లోని మధ్య భాగాల వరకు విస్తరించి ఉంది. ఈ రెండు వాతావరణ వ్యవస్థల ప్రభావంతో రానున్న రోజుల్లో వాతావరణంలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

## నేడు ఢిల్లీ.. రేపు అస్సాంకు సీఎం



**అమరావతి, మే 10** ముఖ్యమంత్రి చంద్రబాబు సోమ, మంగళవారాల్లో ఢిల్లీ, అస్సాం వెళ్లనున్నారు. సోమవారం ఉదయం ఢిల్లీ వెళ్లి.. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా సహా పలువురు కేంద్ర మంత్రులను కలుస్తారు. సాయంత్రం 4 గంటలకు హోటల్ తాజ్ ప్యాలెస్‌లో జరిగే సీఐఐ (భారత పరిశ్రమల సమాఖ్య) వార్షిక సమావేశంలో ప్రసంగిస్తారు. అనంతరం ప్రధాని ఆర్థిక సలహా మండలి చైర్మన్ ఎస్.మహేంద్రదేవ్‌తోపాటు నీతి ఆయోగ్ సభ్యులతో సమావేశమవుతారు. రాత్రికి అక్కడే బసచేసి.. మంగళవారం గువాహటి వెళ్తారు. అక్కడ అస్సాం సీఎంగా హిమంత బిశ్వ శర్మ ప్రమాణస్వీకార కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం అమరావతి బయల్దేరి వస్తారు.

## ఈ ఏడాది యధావిధిగా ఇంటర్ అడ్మిషన్లు : ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి

**-హైదరాబాద్‌మే 10, (రిపబ్లిక్ న్యూస్):**
ఈ ఏడాది యధావిధిగా ఇంటర్మీడియట్ ప్రవేశాలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పాఠశాల విద్యలో ఇంటర్మీడియట్ విలీనంపై ఆయన ఆదివారం సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ప్రవేశాలకు సమయం తక్కువగా ఉండడం, విలీన ప్రక్రియకు పలు సాంకేతిక సమస్యలు అడ్డుగా ఉండడంతో విద్యార్థుల ప్రయోజనాలకు భంగం వాటిల్లకూడదని పాత పద్దతిలో అడ్మిషన్లు చేపట్టాలని సూచించారు. ఇంటర్మీడియట్ ను రద్దు చేసి సీబీఎస్ఈలో తరహాలో 11, 12 తరగతులు నిర్వహించాలనీ, ఫలితంగా డ్రాపౌవుట్స్ గణనీయంగా తగ్గుతాయని తెలంగాణ విద్యా కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. 'సీబీఎస్ఈతో పాటు మెజారిటీ రాష్ట్రాలు 11, 12 తరగతుల విధానాన్ని అనుసరిస్తున్నాయి. మన రాష్ట్రంలో మాత్రం ఇంటర్మీడియట్ విద్య వేరుగా ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి వరకు చదివిన విద్యార్థుల్లో అత్యధికులు ఆ తర్వాత ఇంటర్మీడియట్‌కు వేరుగా ఉన్న కళాశాలల్లో చేరడం లేదు. అప్పటితో విద్యను నిలిపివేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇంటర్మీడియట్‌ను వేరుగా కాకుండా 11, 12 తరగతులుగా కొనసాగించాలి' అని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఇదే అంశాన్ని తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ సైతం తన నివేదికలో పేర్కొందన్నారు. ఇటీవల ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలు నిలిపివేస్తూ అధికారులు ప్రకటన విడుదల చేయడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి ఆందోళన వ్యక్తం చేశారని అన్నారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది పాత పద్దతిలోనే కొనసాగాలని సర్కార్ నిర్ణయించిందని సీఎం తెలిపారు. విలీనంతో ముడిపడిన సాంకేతిక సమస్యలను అధ్యయనం చేయాల్సి ఉన్నందున ఈ ప్రక్రియను తాత్కాలికంగా వాయిదా వేయాలన్నారు. విలీన ప్రక్రియకు సంబంధించి భాగస్వాములతో విస్తృతంగా సంప్రదింపులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ అంశంపై తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీపై నియమించిన కమిటీ అధ్యయనం చేసి తన నివేదిక సమర్పించాలని సూచించారు. ❑

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No./2023/87888



# ఈ ప్రపంచంలో ఉన్న తల్లులందరికీ మదర్స్ డే శుభాకాంక్షలు

## పదాలు తెలియని పెదవులకు అమృత వాక్యం అమ్మ - చల్లని ఒడిలో మొదలైంది ఈ జన్మ

## :-సింగపూర్ తెలుగు సమాజం ఉపాధ్యక్షుడు డాక్టర్ టేకూరి.నాగేశ్వరరావు

**పాములపాడు మే-10 రిపబ్లిక్ న్యూస్:-**
పాములపాడు మండలంలోని, వేంపెంట గ్రామానికి చెందిన సింగపూర్ తెలుగు సమాజం ఉపాధ్యక్షుడు డాక్టర్ టేకూరి.నాగేశ్వరరావు ప్రపంచ తల్లుల దినోత్సవం సందర్భంగా తన భార్య టేకూరి.రేణుక, కుమారులు టేకూరి.యువ, టేకూరి.కుందన్, బంధుమిత్రులతో కలిసి భారీ కేక్ ను కటింగ్ చేసి, తన తల్లి అయిన మాజీ సర్పంచ్ టేకూరి.రామసుబ్బమ్మ కు తినిపించి అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ సమాజ సేవకుడు & వరల్డ్ హ్యూమన్ రైట్స్ అవార్డు గ్రహీత డాక్టర్ టేకూరి.నాగేశ్వరరావు మాట్లాడుతూ అమ్మ.. పేరులో ప్రేమని.. అమ్మ పిలుపులో మాధుర్యాన్ని నింపుకున్న అమృత మూర్తి అమ్మ అని అన్నారు. అంత గొప్ప మానవత్వం ఉన్న అమ్మ, అమ్మ ప్రేమ గురించి ఎంత చెప్పినా తక్కువే అని, అమ్మను ఎంత పొగిడినా తక్కువే అన్నారు. త్యాగమూ, ప్రేమా కలిస్తే అందులో నుంచి అమ్మే పుట్టుకొస్తుందనీ, అమ్మకు ప్రత్యామ్నాయం లేదనీ, అమ్మ ఉన్న చోట అదృష్టం పురి విప్పి ఆడుతుందన్నారు.



ప్రతి ఒక్కరికి “అమ్మ లేకపోతే జననం లేదనీ, అమ్మ లేకపోతే గమనం లేదనీ, అమ్మ లేకపోతే సృష్టిలో జీవం లేదనీ, అమ్మ లేకపోతే అసలు సృష్టే లేదు”.. కంటిపాపలా కాపాడే అమ్మకి ‘ మదర్స్ డే శు భాకాంక్షలు అన్నారు.
“కార్యేషు దాసి.. కరణేశు మంత్రి.. భోజ్యేసు మాత.. ఇలా సమస్తం నీవే”. ఓ మాతృ మూర్తి.. ‘మదర్స్ డే’ సందర్భంగా మీ కిదే మా వందనం అంటూ నినాదాలు చేశారు.
పిల్లలు కనులు తెరిచిన క్షణం నుంచి బంధం కోసం బాధ్యత కోసం, కుటుంబం కోసం అందర్నీ కనుపాపలుగా చూసుకుంటూ, ఆత్మీయత పంచి, తనవారి కోసం అహర్నిశలు కష్టించి, వారిని సహించి, వారి భవిష్యత్తు గురించి, తన ఇంటిని నందనవనం చేసే అమ్మకు...పాదాభివందనం చేస్తూ -హ్యాపీ మదర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు.
అన్నం కలిపి గోరు ముద్దలు పెట్టేటప్పుడు తనకు బిడ్డపై ఉన్న ప్రేమను కూడా కలిపి తన పిల్లలకు పెడుతుందన్నారు. ఆ బిడ్డ ఎంతో ఇష్టంగా ఆ అమ్మ తయారుచేసిన ముద్దలు తింటుంటే... ఆ బిడ్డ కడుపు నిండుతుందో లేదో కానీ, ఆ తల్లి కడుపు ఆనందంతో నిండిపోతుందన్నారు. అమ్మ - ఒక కావ్యం కల్మషం లేని నవ్వు - అమ్మ,నిర్మలమైన మమతల కోవెల అని- అమ్మ,కష్టాన్ని దాచుకుని, నవ్వును పంచే - అమ్మ,నా ప్రాణానికి ఊపిరి అని - నా అమ్మ!కంటిపాపలా కాపాడే కవచం అని, - అమ్మ,లోకం రుచి చూపిన మొదటి గురువు అని - అమ్మ, ఏడవడానికి అయినా, తలదాచుకోవడానికి అయినా,అమ్మ ఒడిని మించిన స్వర్గం లేదనీ అన్నారు.
ఈ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తల్లులందరికీ వరల్డ్ హ్యూమన్ రైట్స్ అవార్డు గ్రహీత డాక్టర్ టేకూరి.నాగేశ్వరరావు పేరుపేరునా హ్యాపీ మదర్స్ డే శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సింగపూర్ నాగేశ్వరరావు యువ సైన్యం, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు

# లారీ ఢీ ... వ్యక్తి దుర్మరణం

**అనంతపురం/పామిడి క్రైమ్, మే 10,( రిపబ్లిక్ న్యూస్ ):**
వాకింగ్ చేస్తున్న వ్యక్తిని లారీ వెనకనుంచి ఢీ కొట్టడంతో వ్యక్తి దుర్మరణం చెందాడు. ఆదివారం ఉదయం నాగిరెడ్డివాకింగ్‌కు వెళ్లగా వేగంగా దూసుకొచ్చిన లారీ ఢీ కొట్టడంతో మృతి చెందిన ఘటన పామిడి 44వ జాతీయ రహదారిపై కలకలం రేపింది. టీచర్స్ కాలనీకి చెందిన నాగిరెడ్డి ఈ ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందడంతో కుటుంబంలో తీవ్ర విషాద ఛాయలు నెలకొన్నాయి.స్థానికుల కథనం ప్రకారం .. అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గం పామిడిలోని టీచర్స్ కాలనీకి చెందిన నాగిరెడ్డి ప్రతి రోజులాగే తెల్లవారుజామున వాకింగ్‌కు వెళ్లారు.



హైవేపై నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి అతివేగంగా వచ్చిన లారీ బలంగా ఢీకొట్టింది. దీంతో వేగంగా వచ్చి ఢీ కొట్టడంతో ఆయన మీటర్ల మేర ఎగిరిపడి రోడ్డుపైనే రక్తపు మడుగులో పడి .. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదం జరిగిన వెంటనే లారీ డ్రైవర్ వాహనంతో పరారైనట్లు సమాచారం. ప్రమాదాన్ని కళ్లారా చూసిన స్థానికులు భయాందోళనకు గురయ్యారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అనంతపురం సర్వజన ఆసుపత్రికి తరలించారు. వ్యక్తితో సహా పరారైన లారీ కోసం గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నాగిరెడ్డి మృతితో పామిడిలోని టీచర్స్ కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

# మంగంపేట వైస్ సర్పంచ్ కౌలూరి మధుసూదన్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు.



**ఓబులవారిపల్లి మే 10 రిపబ్లిక్ న్యూస్.**
తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గ పరిధిలోని ఓబులవారిపల్లి మండలం మంగంపేట నివాసి వ్యాపారవేత్త, మంగంపేట మాజీ వైస్ సర్పంచ్ కౌలూరి మధుసూదన్ రెడ్డి జన్మదినోత్సవం ఆదివారం నాడు కావడంతో ఆయన అభిమానులు తన కార్యాలయం వద్ద జన్మదినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన అభిమానులు ఏర్పాటు చేసిన కేక్ కటింగ్ కార్యక్రమంలో కౌలూరి మధుసూదన్ రెడ్డి పాల్గొని కేక్ కట్ చేసి,విచ్చేసిన అభిమానులకు పంచిపెట్టడం జరిగింది,అనంతరం అభిమానులు ఆయనను శాలువాతో సన్మానించి గజమాలతో సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా కౌలూరి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ నాపై ఇంత ప్రేమ అభిమానం చూపిస్తున్న మంగంపేట గ్రామ ప్రజలకు, నా అభిమానులకు, శ్రేయోభిలాషులకు, బంధుమిత్రులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నానని, అంతేకాకుండా మీరు నాపై చూపిస్తున్నటువంటి ప్రేమను అభిమానాన్ని ఇలాగే కాపాడుకుంటూ ముందుకు కొనసాగుతానని ఎవరికి ఏ ఇబ్బంది వచ్చినా అండదండగా ఉంటానని ఈ సందర్భంగా తెలియజేస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించినటువంటి ప్రతి ఒక్క అభిమానికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నానని అన్నారు



# విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి రైతు బలి

## కాలిపోయిన అరటి తోట .. లక్షల్లో పంట నష్టం -ఆగ్రహించిన బీజేపీ కిసాన్ మోర్చా నేతలు

**అనంతపురం క్రైమ్, మే 10,(రిపబ్లిక్ న్యూస్):**
అనంతపురం జిల్లా నార్పల మండలం వెంకటాంపల్లి గ్రామంలో విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం ఓ రైతును తీవ్ర నష్టాల్లోకి నెట్టింది. గ్రామానికి చెందిన రైతు శ్రీధర్ ఏడాదికి పైగా కష్టపడి సాగు చేసిన అరటి పంట విద్యుత్ లైన్ల లోపాల కారణంగా నాలుగు సార్లు అగ్నికి ఆహుతైపోయింది. ఈ ఘటనతో రైతుకు లక్షల్లో నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. వెంకటాంపల్లి నుంచి మడుగుపల్లి వరకు దాదాపు 250 ట్రాన్స్‌ఫార్మర్లకు సరఫరా అయ్యే విద్యుత్ లైన్‌కు నాసిరకం, చిన్న వైర్లు ఉపయోగించడం వల్ల తరచూ వైర్లు కాలిపోతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. సమస్యపై పలుమార్లు



ఫిర్యాదులు చేసినా సంబంధిత విద్యుత్ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రమాదాలు పునరావృతమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ ఘటనపై బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కడపం దామోదర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్య తెలిసినా విద్యుత్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే రైతు పంట నాశనమైందని మండిపడ్డారు. రైతుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న అధికారుల వైఖరి వెంటనే మారకపోతే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.నష్టపోయిన రైతుకు పూర్తి స్థాయిలో నష్టపరిహారం చెల్లించాలని, బాధ్యులైన ఏ ఈ, ఏడి అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పంటలు కాలిపోతుంటే కార్యాలయాల్లో కూర్చొని నిర్లక్ష్యం చేసే అధికారులను ప్రజలు క్షమించరని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు గంగాధర్, మండల ప్రధాన కార్యదర్శి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

# అంబాపురంలో విషాదం

## గడ్డివాము అగ్నికి ఆహుతి

### బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ



**బేతంచెర్ల ప్రతినిధి, మే 10(రిపబ్లిక్ న్యూస్)**
బేతంచర్ల మండలం అంబాపురం గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన అగ్నిప్రమాదం గ్రామంలో కలకలం రేపింది. గ్రామానికి చెందిన శ్రీ సురేంద్ర నాథ్ రెడ్డి గారి గడ్డివాము అకస్మాత్తుగా మంటల్లో చిక్కుకుని పూర్తిగా దగ్ధమైంది. మంటలు వేగంగా వ్యాపించడంతో గడ్డివాములో నిల్వ ఉంచిన పశువుల మేత, ఎండుగడ్డి పూర్తిగా కాలిపోయినట్లు సమాచారం. ఈ ప్రమాదంలో భారీ ఆస్తి నష్టం సంభవించినట్లు గ్రామస్థులు



తెలిపారు.అగ్నిప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే అప్రమత్తమై మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించినప్పటికీ, అప్పటికే మంటలు తీవ్రరూపం దాల్చడంతో గడ్డివాము పూర్తిగా కాలిబూడిదైంది. ఈ ఘటనతో బాధిత కుటుంబం తీవ్ర ఆవేదనకు గురైంది. గ్రామస్థులు కూడా సంఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.విషయం తెలుసుకున్న వెంటనే డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అగ్నిప్రమాదంతో నష్టపోయిన కుటుంబానికి ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయం అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.అలాగే ఈ ఘటనపై సంబంధిత అధికారులు వెంటనే సమగ్ర విచారణ చేపట్టి, ప్రమాదానికి గల కారణాలను గుర్తించాలని సూచించారు. బాధితులకు తగిన పరిహారం అందించడంతో పాటు, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామస్తులు, పార్టీ కార్యకర్తలు పాల్గొని బాధిత కుటుంబానికి సంఘీభావం తెలిపారు.

# కార్యకర్తలకు అండగా

# ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం

**వైఎస్సార్‌సీపీ నూతన కార్యాలయ ప్రారంభం**

**అనంత వెంకటరామిరెడ్డి, మాజీ మంత్రి సాకే శైలజానాథ్**



**అనంతపురం / శింగనమల, మే 10,( రిపబ్లిక్ న్యూస్ ):**
ప్రజల హక్కుల కోసం, కార్యకర్తలకు అండగా నిలుస్తూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతాం” అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి స్పష్టం చేశారు. శింగనమల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలకు ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయాన్ని మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజానాథ్‌తో కలిసి అనంత వెంకటరామిరెడ్డి ఆదివారం ప్రారంభించారు.

**ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలకు మోసం**

ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి మేలు జరిగిందన్నారు. రైతులు, మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగ యువతకు అండగా నిలిచిన ప్రభుత్వం వైఎస్సార్‌సీపీదేనని పేర్కొన్నారు.ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని తీవ్ర విమర్శలు గుప్పించారు. రైతులకు మద్దతు ధరలు, పంట నష్టపరిహారం, సాగునీటి సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇసుక, మట్టి దోపిడీ పెరిగిపోయిందని, సామాన్య ప్రజలు ఇళ్ల నిర్మాణానికి కూడా ఇసుక దొరకని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పుల భారంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారి తరఫున వైఎస్సార్‌సీపీ గళం వినిపిస్తూనే ఉంటుందని స్పష్టం చేశారు.

**కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా నేనున్నా : మాజీ మంత్రి**

డాక్టర్ సాకే శైలజానాథ్ మాట్లాడుతూ పార్టీ కార్యకర్తల సమన్వయానికి ఈ కార్యాలయం కేంద్రబిందువుగా మారుతుందన్నారు. “కార్యకర్తలే పార్టీకి వెన్నెముక. వారికి ఏ కష్టం వచ్చినా నేనున్నాను. కంటికి రెప్పలా కాపాడుకుంటాం” అని భరోసా ఇచ్చారు. ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడంలో కార్యకర్తలు ముందుండాలని, ప్రతి గడపకు పార్టీ సిద్ధాంతాలను తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసిన ఆయనడ సాగునీరు, ఎరువులు, కనీస మద్దతు



ధరల అంశాల్లో రైతులను ఆదుకోవాలని కోరారు. నష్టపోయిన రైతుల పక్షాన నేడు ఉదయం 10 గంటలకు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయనున్నట్లు ప్రకటించారు. రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల స్థాయి నాయకులు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# రైతుసంఘం నూతన కమిటి

**ఆంధ్రప్రదేశ్ రైతు సంఘంలో రైతులంతా సభ్యులుగా చేరండి.**

**జిల్లా అధ్యక్షులు ఏ. రాజశేఖర్**



**బేతంచెర్ల ప్రతినిధి, మే 10(రిపబ్లిక్ న్యూస్)**

నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలం కనుమకింది కొట్టాల గ్రామం లో జె. మద్దిలేటి అధ్యక్షతన నూతన గ్రామ కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి జిల్లాఅధ్యక్షులు ఏ. రాజశేఖర్, ఉపాధ్యక్షులు వి.సుబ్బారాయుడు మండల కార్యదర్శి పి.రామమోహన్ లు హాజరయ్యారు. వీరు మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారం కోసం రైతు సంఘం నిరంతరం కృషి చేస్తుందని రైతులు పండించిన పంటలకు ప్రభుత్వాలుగిట్టుబాటు ధరలు కల్పించడం లేదని ఎరువులు, పురుగుమందులు, వ్యవసాయ పరికరాలు, పెట్రోల్, డిజల్, రవాణాచార్జీలధరలు విపరీతంగా పెరిగిపోయి రైతులపై భారంపాడుతుందని విదేశి దిగుమతులను అనుమతి ఇచ్చి మన దేశ రైతంగాన్ని దివాళా తీస్తున్నారాని అన్నారు. అందువలన గ్రామ గ్రామ న రైతులందరు సంఘలుగా ఏర్పడి రైతుసమస్యలు పరిష్కరానికి కృషిచేయాలన్నారు.అనంతరం రైతు సంఘం నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులు జె. మద్దిలేటి కార్యదర్శి కే. సునీల్, ఉపాధ్యక్షులు జె. శివకుమార్,సహాయ కార్యదర్శివి. సుబ్బారాయుడు కమిటీ సభ్యులు జి.చేక్రవర్తి,మధుమోహన్, నాగమల్లేశ్వరుడు, మధుశేఖర్, రమేష్ లను ఎన్నుకోవడం జరిగింది.

## ఆర్ఎస్ రంగాపురం లో ప్రభుత్వం తక్షణమే ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలి

**డ్రైనేజ్ కాలువలు ఏర్పాటు చేశారు కానీ సిసి రోడ్డు వేయలేదు**

**రాబోయే వర్షాకాలంలో ఎస్సీ కాలనీ మురికి కూపం గా మారుతుందని కాలనీవాసుల భయం**

**- త్వరగా సిసి రోడ్ ఏర్పాటు చేయాలని ఎస్సీ కాలనీవాసుల విజ్ఞప్తి**



**బేతంచెర్ల ప్రతినిధి, మే 10 (రిపబ్లిక్ న్యూస్)**

బేతంచర్ల మండలం ఆర్ఎస్ రంగాపురం గ్రామంలోని ప్రభుత్వం తక్షణమే,ఎస్సీ కాలనీలో సిసి రోడ్డును ఏర్పాటు చేయాలని కాలనీవాసులు ఆదివారం విలేకరులకు తెలిపారు. దళిత ప్రజలు మాట్లాడుతూ. మా కాలనీలో నూతనంగా డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేశారని, కానీ సీసీ రోడ్డు ఏర్పాటు చేయడం అధికారులు మరిచారని ప్రజలు వాపోతున్నారు. ఇప్పుడు వర్షానికే రోడ్డు నిండా మురికి నీరు చేరుకొని ఇళ్లలోకి వెళ్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ మురికి నీరు దుర్వాసన వస్తుందని, తద్వారా నానా రోగాలు పాలవుతామని వారు అంటున్నారు. ఏది ఏమైనా ఉన్నతాధికారులు స్పందించి వర్షాకాలం రాకముందే, మా దళిత కాలనీకి సిసి రోడ్డు ఏర్పాటు చేయాలని ఎస్సీ కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోమాలో చికిత్స పొందుతున్న వైఎస్ఆర్సీపీ కార్యకర్త బషీర్‌ను

**పరామర్శించిన పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి**



**ఓర్వకల్లు ప్రతినిధి, మే 10(రిపబ్లిక్ న్యూస్)**

ఓర్వకల్లు మండలం గుట్టపాడు గ్రామానికి చెందిన వైఎస్ఆర్సీపీ కార్యకర్త బషీర్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లారు. ప్రస్తుతం ఆయన కర్నూలు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లోని ×జఖలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వైఎస్ఆర్సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రామభూపాల్ రెడ్డి హాస్పిటల్‌కు వెళ్లి బషీర్ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగితెలుసుకున్నారు.అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. పార్టీ కార్యకర్తలకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇస్తూ, బషీర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గుట్టపాడు రామకృష్ణ రెడ్డి, అక్కిమి హనుమంత రెడ్డి, పాలకొలను రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మెరిసిన అక్షర ఆణిముత్యాలు

**విద్యార్థుల ప్రతిభకు పట్టాభిషేకం - డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ప్రతిభా పురస్కారాలు**

**విద్యార్థులకు ఆర్డీవో చేతుల మీదుగా అవార్డుల ప్రదానం**



**శ్రీ సత్య సాయి పుట్టపర్తి, మే10,(రిపబ్లిక్ న్యూస్):**

పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు సత్తా చాటారు. పుట్టపర్తిలోని బీసీ హాస్టల్ నందు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. ఇటీవల పదవ తరగతి పరీక్షల ఫలితాలు విడుదల కావడంతో

విద్యార్థులు అత్యుత్తమ మార్కులను సాధించడం గర్వంగా ఉందన్నారు. చదువుతోనే దేనినైనా సాధించవచ్చుని, తల్లిదండ్రుల కష్టాన్ని దృష్టిలో ఉంచుకొని విద్యార్థులు కష్టపడి చదవాలని పుట్టపర్తి ఆర్డిఓ సువర్ణ అన్నారు. ఆదివారం శ్రీ సత్య సాయి జిల్లా పుట్టపర్తి పట్టణంలోని బీసీ హాస్టల్ నందు ఆంధ్రప్రదేశ్ మాల మహానాడు ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవం ఘనంగా నిర్వహించారు. జిల్లాలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి పదవ తరగతి పరీక్షల్లో 600 మార్కులకు గాను 500 కి పైగా మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాల సంక్షేమ ఐక్యవేదిక అధ్యక్షులు కోట్ల గంగాధర్, మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు జూటూరు మహేంద్ర, జిల్లా అధ్యక్షుడు పీ.ఎం.శంకర్ తదితర ప్రముఖులు హాజరయ్యారు. అనంతరం అతిథుల చేతుల మీదుగా విద్యార్థులకు మెమొంటోలు ,ప్రశంసా పత్రాలు అందజేసి శ్యాలువాలతో విద్యార్థులను ఘనంగా సన్మానించారు.

**అంబేద్కర్ కలలు కన్న సమాజ నిర్మాణానికి విద్యే మార్గం**

ఈ సందర్భంగా ఆర్డీవో సువర్ణ మాట్లాడుతూ మీ చదువుల వెనుక మీ అమ్మానాన్నల త్యాగం ఉంది. మీ ముందు అంబేద్కర్ కలలుకన్న సమాజం ఉంది. ఈ రెండిటిని గుర్తుంచుకొని చదవాలని విద్యార్థులకు భరోసా కల్పించారు. చదువుతోనే దేనినైనా సాధించవచ్చుని, చిన్నతనం నుంచే లక్ష్యం నిర్దేశించుకోవాలని ఆమె సూచించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ డాక్టర్ అంబేద్కర్ కలలుకన్న సమాజ నిర్మాణానికి విద్యనే ఏకైక మార్గమని,చిన్నతనం నుంచి లక్ష్యంతో చదివితేనే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని తెలిపారు. పేదరికాన్ని జయించాలంటే విద్య తప్ప మరో ఆయుధం లేదని ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ఇతరులకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు ఎం.ఎన్.మూర్తి, రామాంజనేయులు, చెరుకూరి గంగులయ్య, కురుగుంట గోవిందు, సుగమంచి శ్రీనివాసులు, గుమ్మగట్ట ఈశ్వరయ్య, మనోహర్ మాల, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.





# ముస్లిం విద్యార్థుల భవిష్యత్తుకు 'తాలీం-ఏ-హునర్' భరోసా

**టాలెంట్ టెస్ట్ పోస్టర్లు ఆవిష్కరణ**

**ముఖ్యమంత్రి చంద్రబాబు, లోకేష్, ఫరూక్‌లకు**

**ముస్లిం నాయకుల ప్రత్యేక కృతజ్ఞతలు**

**అనంతపురం టౌన్, మే 10,(రిపబ్లిక్ న్యూస్):**

"విద్యకు పేదరికం అడ్డుకాకూడదు" అన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'తాలీం-ఏ-హునర్' కార్యక్రమంపై ముస్లిం మైనార్టీల్లో ఆశలు చిగురిస్తున్నాయి. అనంతపురం పాతూరులోని జామియా మసీదు ఎదుట ఆదివారం 'తాలీం-ఏ-హునర్ టాలెంట్ టెస్ట్' పోస్టర్‌ను ముస్లిం నాయకులు ఘనంగా ఆవిష్కరించారు.

**ఉచిత రెసిడెన్షియల్ విద్య కల్పించడం అభినందనీయం**

ఈ సందర్భంగా పలువురు ముస్లిం నాయకులు మాట్లాడుతూ పేద ముస్లిం విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను పూర్తిగా ఉచితంగా అందించాలన్న ఆలోచన చరిత్రలో ఇదే తొలిసారిగా అమలవుతోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మైనార్టీ విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారని కొనియాడారు.మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ ఫరూక్ , ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్



అబ్దుల్ అజీజ్

ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం అమలవుతుండటంపై హర్షం వ్యక్తం చేశారు. పేద ముస్లిం కుటుంబాల పిల్లలకు ఐ ఐ టి జేఈఈ, నీట్,ఎంసెట్ కోచింగ్‌తో కూడిన ఉచిత రెసిడెన్షియల్ ఇంటర్మీడియట్ విద్య కల్పించడం అభినందనీయమన్నారు.ఈ పథకం కింద కార్పొరేట్ కళాశాలల్లో ఉచిత విద్యతో పాటు హాస్టల్, భోజనం, పుస్తకాలు పూర్తిగా ఉచితంగా అందించనున్నట్లు వివరించారు. ఆడపిల్లలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడం మరో విశేషమని పేర్కొన్నారు.

**మైనార్టీల సంక్షేమానికి మరిన్ని పథకాలు అమలు చేయాలి**

2025-26 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పరీక్షల్లో 600 మార్కులకు గాను 450కు పైగా మార్కులు సాధించిన ముస్లిం విద్యార్థులు, సి బి ఎస్ ఈ, ఐ సి ఎస్ ఈ లో 75 శాతం మార్కులు పొందిన విద్యార్థులు అర్హులని తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా మెరిట్ ఆధారంగా 250 మందిని ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు.జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. 2027-28 విద్యా సంవత్సరం నుంచి ఈ అవకాశాలను 500 మంది విద్యార్థులకు విస్తరించనున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో మైనార్టీల సంక్షేమానికి మరిన్ని పథకాలు అమలు చేయాలని ఆశిస్తున్నట్లు ముస్లిం నాయకులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్, వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో ఐఎంఎం మహబూబ్ బాషా, టీడీపీ నగర మైనార్టీ మాజీ అధ్యక్షుడు షౌకత్ ఖాన్, టీడీపీ నాయకులు బాబావలి, నాసిర్, వన్నూరు భాషా, రఫీ, గఫూర్, మహబూబ్ పీర్, నూర్ మొహమ్మద్, సలీం భాషా తదితరులు పాల్గొన్నారు.


# పుల్లగంటి కుటుంబానికి లక్ష రూపాయల ఆర్థిక సహాయం.

## ముక్కా ఫౌండేషన్.


**ఓబులవారిపల్లి మే 10 రిపబ్లిక్ న్యూస్.**

ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన కీర్తిశేషులు పుల్లగంటి ప్రతాప్ కుటుంబానికి ముక్కా రూపానంద్ రెడ్డి ఫౌండేషన్ తరపున ఆదివారం లక్ష రూపాయలు ఆర్థిక సహాయం చేయడం జరిగినది, వివరాల్లోకి వెళితే ఓబులవారిపల్లి మండలం అయ్యల రాచపల్లి గ్రామానికి చెందిన పుల్లగంటి ప్రతాప్ ఇటీవల ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మరణించడం జరిగినది విషయం తెలుసుకున్న కూడా చైర్మన్ రైల్వే కోడూరు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ముక్కా రూపానంద రెడ్డి, ఆయన సతీమణి ముక్కా వరలక్ష్మి దంపతులిద్దరూ ఆయన మృతదేహాన్ని సందర్శించి ఆ కుటుంబానికి తోడుగా ఉంటానని హామీ ఇవ్వడం జరిగినది, ఆ హామీ ని నిలబెట్టుకుంటూ ఆదివారం కీర్తిశేషులు పుల్లగంటి ప్రతాప్ కుటుంబ సభ్యులను కలిసి ముక్కా ఫౌండేషన్ తరపున రూపానంద రెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మి, ఆయన తనయుడు తెలుగుదేశం పార్టీ యువ నేత ముక్కా సాయి వికాస్ రెడ్డి లు లక్ష రూపాయలు ఆర్థిక సహాయం చెక్కును ఆయన కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగినది

ఈ సందర్భంగా ముక్కా వరలక్ష్మి మాట్లాడుతూమన



ముక్కా రూపానంద రెడ్డి ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు, నిర్వహించడం జరిగినదని, నిరుపేదలకు వైద్య నిమిత్తం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించామని, అలాగే దేవాలయాలకు, పేద కుటుంబాల ఆడబిడ్డల పెళ్లిళ్లకు, పేద విద్యార్థిని విద్యార్థుల చదువులకు సహాయ సహకారాలు అందించడం జరిగిందని ఇలాంటి సహాయ సహకారాలు మా ఫౌండేషన్ తరపున ఎల్లప్పుడూ నిర్వహిస్తూ ఉంటామని అందులో భాగంగానే ముక్కా రూపానంద రెడ్డి ఆదేశాల మేరకు కీర్తిశేషులు పుల్లగంటి ప్రతాప్ కుటుంబాన్ని పరామర్శించి వారి కుటుంబానికి అండగా మేము ఉంటామంటూ భరోసానిచ్చి లక్ష రూపాయల చెక్కును అందజేయడం



జరిగిందని,మరి ఏ ఇతర సహాయ సహకారాలు కావాలన్నా మేము అండగా నిలబడతామని ఈ సందర్భంగాఆమె వారి కుటుంబానికి మరోసారి హామీ ఇస్తున్నానని వరలక్ష్మి అన్నారు, అనంతరం

ముక్కా సాయి వికాస్ రెడ్డి మాట్లాడుతూ నిత్యం ప్రజాసేవకై అహర్నిశలు కష్టపడుతూ ఉన్న మాకు నేడు కీర్తిశేషులు పుల్లగంటి ప్రతాప్ కుటుంబానికి ఆర్థికంగా ఆదుకోవడం బాధ్యతగా అనిపించిందని తెలియజేస్తూ, వారి కుటుంబ సభ్యులకు భరోసాగా నిలుస్తామని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిరుపేదలకు అండగా నిలిచిన ఏపీఎస్‌సీడబ్ల్యూఏ కార్యదర్శి శ్రీనివాసులు

**అనంతపురం సంక్షేమం, మే 10,( రిపబ్లిక్ న్యూస్ ):** మదర్స్ డే సందర్భంగా మానవత్వాన్ని చాటుతూ ఏపీఎస్‌సీడబ్ల్యూఏ కార్యదర్శి శ్రీనివాసులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్గీయ తన మాతృమూర్తి జ్ఞాపకార్థం కొంతమంది నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేసి ఆదర్శంగా నిలిచారు.

**బాలికకు అవసరమైన పుస్తకాలు, దుస్తులు అందజేత**

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "తల్లి ప్రేమకు ప్రపంచంలో ఎలాంటి విలువ కట్టలేం. అమ్మ జ్ఞాపకార్థంగా సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేయడం తన బాధ్యతగా భావిస్తున్నాను" అని పేర్కొన్నారు.

ఇటీవల పరిచయమైన శైలజ అనే బాలిక చదువుపై ఆసక్తి చూపుతున్నప్పటికీ కుటుంబ ఆర్థిక పరిస్థితులు బలహీనంగా ఉన్నాయని తెలుసుకున్న శ్రీనివాసులు, ఆమెకు అండగా నిలిచారు. ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న శైలజ తల్లిదండ్రులు రోడ్డుపై పండ్లు





అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. బాలిక భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని చదువుకు అవసరమైన పుస్తకాలు, ఇతర మెటీరియల్‌తో పాటు దుస్తులు అందజేస్తానని హామీ ఇచ్చిన ఆయన, మదర్స్ డే సందర్భంగా ప్రత్యేకంగా కొత్త డ్రెస్‌ను అందించి చిన్నారిలో ఆనందం నింపారు. శ్రీనివాసులు చేస్తున్న సేవా కార్యక్రమాన్ని స్థానికులు అభినందించారు. సేవా కార్యక్రమాలను మరింత మందికి అందించి ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలని వారు ఆకాంక్షించారు.

# ఇండ్లు లేని నిరుపేదలకు స్థలాలు వెంటనే ఇవ్వాలి

## ఆర్ఎస్పి డిమాండ్

**నంద్యాల ప్రతినిధి, మే 10 (రిపబ్లిక్ న్యూస్**

నంద్యాల టౌన్ లో ఇల్లు లేని నిరుపేదలు వందల మంది ఉన్నారు వాటిని గుర్తించి వెంటనే ఇంటి స్థలాలు ఇవ్వాలని అదేవిధంగా భూమిలేని నిరుపేదలు భూమి ఇవ్వాలని ఆర్ఎస్పీ నంద్యాల జిల్లా కార్యదర్శి ఎ సుబ్బరాయుడు ఆవేదన వ్యక్తం చేశారు ముఖ్యంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఆర్ఎస్పీ కార్యాలయం నందు నంద్యాల టౌన్ లోని ఇల్లు లేని నిరుపేదలు అనేకమంది ఉన్నారని వారు ఇంటి బాడిగలు కట్టలేక ఉన్నారని పట్టించుకున్న పాపాన లేరని వారితో ఓట్ల వరకే ఏపిచ్చుకుంటారు తప్ప ఎన్ని ప్రభుత్వాలు మారినా సెంటు స్థలం ఇచ్చిన పాపాన లేదు కావున తక్షణమే వారికి ఇండ్ల స్థలాలు ఇవ్వాలని మన నంద్యాల జిల్లా ఏర్పాటైన తరువాత ఇంటి బాడిగల్లు విపరీతంగా పెరిగి ఉన్నాయి ఇంటి బాడిగలు కట్టలేక చాలా ఇబ్బంది పడుతున్నారు తక్షణమే ఇంటి స్థలాలు ఇవ్వాలని లేని



పక్షంలో రెవిలైషనరీ సోషలిస్ట్ పార్టీ ఆర్ఎస్పి పార్టీ ఇల్లు లేని నిరుపేదలకు అండగా ఉంటూ భూపోరాటాలు చేస్తామని ఆయన హెచ్చరించారు అదేవిధంగా నంద్యాల జిల్లాలోని ఒంటరి మహిళలకు పింఛన్లు ఇవ్వాలని చాలామందికి వయసు పెరిగిన ఆధార్ కార్డులో వయసు తక్కువగా ఉండటం వల్ల పింఛన్లు రావడం లేదు కావున వారిని గుర్తించి తక్షణమే వాళ్లకు పింఛన్ ఇవ్వాలని కోరుచున్నాము అదేవిధంగా రెవెన్యూ అధికారులు భూములు ఉన్న రైతుల పేర్లు మార్పిడి చేసి వారికి లేకుండా వేరే వారి పేరు మీద ఎక్కించడం జరిగింది. ఎన్నిసార్లు కలెక్టర్ ఆఫీస్ చుట్టూ తిరుగుతున్న ఆ పంచాయతీలు తెగడం లేదు అధికారులు స్పందనలో ఇచ్చిన కింది స్థాయికి పోయాలకు అక్కడ నామకార్థంగా వాళ్ళని పిలిపించి ఫోటోలు తీసి మీ పని తెంచుతామని చెప్పడమే తప్ప వారికి ఎటువంటి న్యాయం జరగలేదు. ఇప్పటికైనా గాని కలెక్టర్ , చొరవ తీసుకొని కింద స్థాయి అధికారులకు వెంటనే వారి పైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు అదేవిధంగా ఆర్ఎస్పి రెవలేషనరీ సోషలిస్ట్ పార్టీ నంద్యాల టౌన్ కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది కలం భాష టౌన్ కార్యదర్శిగా సిరిపుల్ల సహాయ కార్యదర్శిగా ప్రభాకర్ సహాయ కార్యదర్శిగా ఎన్నుకోవడం జరిగింది నంద్యాల కౌన్సిల్గా మున్నా భాష సుబేతుల్లా మున్నేర్ యాకోబు షరీఫ్ నూరిల్ల టౌను కౌన్సిల్ గా ఎన్నుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు పాల్గొన్నవారు షేక్ మున్ని మహిళా సమాఖ్య అమినాబి పావని జమీల వహీదా సాహిని ఆదిలక్ష్మి భాష కిట్టు పాల్గొనడం జరిగింది

# వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభకు అమలాపురం సిద్ధం

### నేటి నుంచి మూడు రోజుల పాటు నిర్వహణ -తొలి రోజు ర్యాలీ, బహిరంగ సభ

**అమలాపురం :** ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం 30వ రాష్ట్ర మహాసభకు సర్వం సిద్ధమైంది. సోమవారం నుంచి మూడు రోజుల పాటు జరిగే ఈ మహాసభకు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం వేదిక కానుంది. ఇప్పటికే పట్టణ వీధులు ఎర్రజెండాలతో నిండిపోయాయి. ఈదరపల్లి వంతెన, బస్టాండ్, కలశం సెంటర్, గడియార స్తంభం సెంటర్, హై స్కూల్స్ సెంటర్ ఎర్ర జెండాలు, తోరణాలతో ముస్తాబయ్యాయి. పట్టణంలోని గడియార స్తంభం సెంటర్లోని గంగరాజు ఫంక్షన్ హాల్లో మహాసభ జరగనుంది. ఈ నెల 11న ప్రదర్శన, బహిరంగ సభ, 12న ప్రతినిధుల సభ, 13న ముగింపు సభ



జరుగుతుంది. అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు ఎ.విజయరాఘవన్, ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, సహాయ కార్యదర్శి విక్రమ్ సింగ్, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు హాజరు కానున్నారు.

**500 మంది ప్రతినిధులు హాజరు**

అమలాపురంలో జరగనున్న మహాసభకు రాష్ట్ర వ్యాప్తంగా 500 మంది ప్రతినిధులు హాజరు కానున్నారని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు తెలిపారు. వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటూ ఉపాధి హామీ చట్టం, కౌలురైతుల సమస్యలు, గిట్టుబాటు ధర తదితర అంశాలపై మహాసభలో చర్చిస్తారన్నారు. అనంతరం కార్యాచరణ రూపొందిస్తారని తెలిపారు.

# ఐపీఎస్ భార్య హత్య కేసు.. పనిమనిషి కల్పన కోసం పోలీసుల వేట

**విశ్రాంత ఐపీఎస్ అధికారి భార్య హత్య కేసులో దర్యాప్తు ముమ్మరం**

**పనిమనిషి కల్పనే ప్రధాన నిందితురాలని పోలీసుల నిర్ధారణ**

**నిందితుల కోసం నేపాల్ సరిహద్దులో గాలింపు**

**పక్కా పథకం ప్రకారమే దోపిడీ, హత్య జరిగిందని అనుమానం**

**హైదరాబాద్,:**

జూబ్లీహిల్స్‌లో సంచలనం సృష్టించిన విశ్రాంత ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రే భార్య తనూజ (60) హత్య కేసులో నిందితుల కోసం పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు. గురువారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటనలో ఊపిరాడకుండా చేసి ఆమెను హత్య చేసినట్లు పోస్టుమార్టం ప్రాథమిక నివేదికలో వెల్లడైంది. ఉన్నతాధికారులు నివసించే ప్రశాసన్‌నగర్‌లో ఇంతటి దారుణం జరగడంతో ఈ కేసును పోలీసులు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు.

దర్యాప్తు కోసం పదికి పైగా ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. సుమారు 200 సీసీటీవీ కెమెరాల ఫుటేజీని విశ్లేషించి కీలక ఆధారాలు సేకరించారు. ప్రధాన నిందితురాలు, ఇంట్లో పనిమనిషిగా చేరిన కల్పన తన సహచరులతో కలిసి



ఆటోలో నాంపల్లికి వెళ్లి, అక్కడి నుంచి తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌లో నాగ్‌పూర్ వైపు పారిపోయినట్లు గుర్తించారు. అయితే, పోలీసులను తప్పుదోవ పట్టించేందుకు నిందితులు మార్గమధ్యంలోనే రైలు దిగిపోయి ఉంటారని అనుమానిస్తున్నారు. కొన్ని టాస్క్‌ఫోర్స్ బృందాలు శుక్రవారం సాయంత్రానికే నేపాల్ సరిహద్దులకు చేరుకున్నట్లు సమాచారం.

ఈ దోపిడీ, హత్య వెనుక పక్కా ప్రణాళిక ఉందని పోలీసులు నిర్ధారించారు. పనిలో చేరడం దగ్గర నుంచి దోపిడీ వరకు బయటి వ్యక్తుల ఆదేశాలతోనే కల్పన నడుచుకుందని భావిస్తున్నారు. ఆమెకు సన్నిహితంగా ఉన్న పలువురు నేపాలీ మహిళలను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. నిందితులు ముగ్గురా, నలుగురా అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. ఘటనా స్థలంలో లభించిన సెల్‌ఫోన్ల ఆధారంగా కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# మహిళలు, చిన్నారుల భద్రతే లక్ష్యం

### ప్రజల్లో అవగాహన పెంచడమే ధ్యేయం -శక్తి టీం అవగాహన కార్యక్రమం




**శ్రీ.సత్యసాయి క్రైమ్, మే10,( రిపబ్లిక్ న్యూస్):** మహిళలు, బాలికలు, చిన్నారుల భద్రతపై శక్తి టీం ఆధ్వర్యంలో విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ ఐపీఎస్ ఆదేశాల మేరకు శక్తి యాప్ ప్రాముఖ్యతను ప్రజలకు వివరించి, అత్యవసర పరిస్థితుల్లో మహిళలు, బాలికలు వెంటనే సహాయం పొందేందుకు శక్తి యాప్ ఎలా ఉపయోగపడుతుందో తెలియజేశారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, ఫేక్ లోన్ యాప్స్ మోసాలు, బ్యాంకు మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాల్య వివాహాల దుష్పరిణామాలు, పోక్సో చట్టం, మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, వాటికి సంబంధించిన చట్టపరమైన చర్యల గురించి అవగాహన కల్పించారు. చిన్నారులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి వివరించి, అనుమానాస్పద పరిస్థితుల్లో వెంటనే పెద్దలకు లేదా పోలీసులకు తెలియజేయాలని సూచించారు. అదేవిధంగా అత్యవసర సహాయ నంబర్లు 100/112, మహిళల హెల్ప్‌లైన్ 181, అగ్నిమాపక సేవల కోసం 101, సైబర్ మోసాల ఫిర్యాదుల కోసం 1930, బాలల సహాయ నంబర్ 1098 గురించి ప్రజలకు వివరించారు. కోడి పందేలు వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. శక్తి టీం నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ ప్రజలు, మహిళలు, యువత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల భద్రత, మహిళల రక్షణ, చిన్నారుల సంక్షేమం కోసం అవగాహన కార్యక్రమాలుకొనసాగుతాయని శక్తి టీం సభ్యులు తెలిపారు.

# ఘనంగా విలేఖరి రామకృష్ణ జన్మదిన వేడుకలు



**గుత్తి మే 10,( రిపబ్లిక్ న్యూస్)**

ప్రజాశక్తి విలేఖరి రామకృష్ణ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతపురం జిల్లా గుత్తి పట్టణంలోని రోడ్లు భవనాల శాఖ కార్యాలయంలో ఆదివారం

విలేఖరి రామకృష్ణ జన్మదిన వేడుకలు బంధువులు, విలేకరులు, స్నేహితులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, రాజకీయ నాయకుల మధ్య హోల్లాద వాతావరణంలో జరిగాయి. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వారు విలేకరి రామకృష్ణకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. రామకృష్ణ జర్నలిజం రంగంలో మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని వారు ఆకాంక్షించారు. ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ ప్రజల గొంతుకగా నిలుస్తున్న ఆయన ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో చేసుకోవాలని, నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని భగవంతుణ్ణి ప్రార్థించారు.

**సమస్యలను నిర్భయంగా వెలుగులోకి తీసుకువస్తున్న రామకృష్ణ సేవలు అభినందనీయం**

ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జర్నలిజం అనేది సమాజానికి అద్దం పట్టే వృత్తి అని, ప్రజల సమస్యలను నిర్భయంగా వెలుగులోకి తీసుకువస్తున్న రామకృష్ణ సేవలు అభినందనీయమని వారు కొనియాడారు. కార్యక్రమంలో బంధువులు, పత్రికా విలేకరులు, స్నేహితులు, కుల, ప్రజా సంఘాల ప్రతినిధులు, రాజకీయ నాయకులు తదితరులు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# రాజకీయ వ్యూహకర్త స్థాయి నుండి తమిళనాడు కేబినెట్ లో కీలక మంత్రి వరకు

### మహిళకు కీలకమైన మంత్రి పదవి ఇవ్వడం మహిళలు ఆనందం వ్యక్తం

**కర్నూలు ప్రతినిధి, మే 10(రిపబ్లిక్ న్యూస్)**

ఇవాళ ముఖ్యమంత్రి విజయ్ మంత్రివర్గంలో 30 ఏళ్ల యువ ఎమ్మెల్యే ఎస్. కీర్తన మంత్రిగా బాధ్యతలు చేపట్టనున్నారు. కేవలం 30 ఏళ్ల వయసులోనే ముఖ్యమంత్రి విజయ్ కేబినెట్‌లో మంత్రిగా బాధ్యతలు చేపట్టబోతున్న ఆమె, ఆధునిక రాజకీయాల్లో యువత పాత్రకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు. చదువు పూర్తయ్యాక డేటా అనలిటిక్స్, స్టాటిస్టిక్స్‌పై ఉన్న పట్టుతో ఆమె 'షోటైమ్ కన్సల్టింగ్' సంస్థలో పొలిటికల్ కన్సల్టెంట్‌గా చేరారు.



2024 ఆంధ్రప్రదేశ్ ఎన్నికల సమయంలో తెలుగుదేశం పార్టీ విజయానికి అవసరమైన డిజిటల్ వ్యూహాలను రూపొందించడంలో ఆమె కీలక పాత్ర పోషించారు.

ముఖ్యంగా 'సూపర్ సిక్స్' వంటి పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడం, డేటా విశ్లేషణ ద్వారా నియోజకవర్గాల వారీగా ప్రచారాన్ని నడిపించడంలో ఆమె చాకచక్యం ప్రదర్శించారు. ఈ వృత్తిపరమైన అనుభవమే ఆమెను తమిళనాడు రాజకీయాల్లో విజయ్ స్థాపించిన 'తమిళ వెట్రి కళగం' (TVK) పార్టీకి దగ్గర చేసింది. పార్టీకి కేవలం సినీ గ్లామర్ మాత్రమే సరిపోదని, శాస్త్రీయమైన ఎన్నికల వ్యూహాలు అవసరమని గుర్తించిన విజయ్, కీర్తనలోని నైపుణ్యాన్ని గుర్తించి ఆమెకు శివకాశి నియోజకవర్గం నుండి పోటీ చేసే అవకాశం కల్పించారు,తొలి ప్రయత్నంలోనే ఎమ్మెల్యేగా ఘనవిజయం సాధించిన కీర్తన, ఇప్పుడు మంత్రిగా సరికొత్త బాధ్యతను స్వీకరించబోతున్నారు. రాజకీయాలంటే కేవలం వారసత్వం లేదా సుదీర్ఘ అనుభవం మాత్రమే కాదు, పక్కా ప్రణాళిక మరియు ప్రజల నాడిని పట్టుకునే నైపుణ్యం ఉంటే యువత కూడా అత్యున్నత శిఖరాలను అధిరోహించగలరని ఆమె నిరూపించారు,ఒక సాధారణ వ్యూహకర్తగా మొదలైన ఆమె ప్రస్థానం, నేడు తమిళనాడు ప్రభుత్వంలో కీలక నిర్ణయాలు తీసుకునే స్థాయికి చేరడం విశేషం.కంగ్రాట్స్ కీర్తన

# గ్రామ పంచాయతీల అభివృద్ధిలో ఏపీకి జాతీయ గుర్తింపు.. పవన్ కల్యాణ్ ప్రశంసలు



**అమరావతి, మే 10 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి జాతీయ స్థాయిలో మరో కీలక గుర్తింపు లభించింది. కేంద్రప్రభుత్వం ప్రకటించిన దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ పంచాయత్ సతత్ వికాస్ పురస్కార్--2025, నానాజీ దేశ్‌ముఖ్ సర్వోత్తమ్ పంచాయత్ సతత్ పురస్కార్--2025 అవార్డుల్లో దేశవ్యాప్తంగా ఏపీ రెండో స్థానం సాధించింది. ఈ విజయంపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోషల్ మీడియా ఎక్స్ వేదికగా డిప్యూటీ సీఎం స్పందించారు.. స్థానిక సంస్థలను బలోపేతం చేయాలనే దృఢ సంకల్పంతో సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను కేంద్రప్రభుత్వం గుర్తించడం గర్వకారణమని తెలిపారు. పంచాయతీ అభివృద్ధికి కేంద్రం గుర్తింపు..గ్రామ పంచాయతీలు సాధించిన విజయాన్ని ప్రత్యేకంగా పవన్ కల్యాణ్ ప్రస్తావించారు. గ్రామస్థాయిలో పనిచేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామప్రజల సమష్టి కృషి వల్లే ఈ గుర్తింపు వచ్చిందని అన్నారు. వివిధ విభాగాల్లో జాతీయ స్థాయి అవార్డులు సాధించిన గ్రామ పంచాయతీల్లో శృంగవరం, బొక్కసంపాలెం, చెముళ్లపల్లి, గుండమాల పేర్లు నిలిచాయి. ఈ గ్రామాల సర్పంచ్‌లు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలకు పవన్ కల్యాణ్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు సమర్థవంతంగా అమలు చేయడం, ప్రజల భాగస్వామ్యంతో పంచాయతీ వ్యవస్థను బలోపేతం చేయడం వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుకి కూడా పవన్ కల్యాణ్ మనస్ఫూర్తిగా అభినందనలు తెలిపారు.

# వైసీపీ ప్రభుత్వంలో రైతులను ముప్పుతిప్పలు పెట్టారు: మంత్రి నిమ్మల

**పశ్చిమ గోదావరి జిల్లా, మే 10:** పాలకొల్లు నియోజకవర్గంలో రూ 5.61 కోట్లతో పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలు అమలు చేసి మాట నిలబెట్టుకున్నామని తెలిపారు. వ్యవసాయం, రైతు సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందని మంత్రి వెల్లడించారు.'2025-26 రబీ సీజన్లో రాష్ట్రంలో 1679 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 17.47 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరించాం. ధాన్యం అమ్మిన 24 గంటల్లో 1.67 లక్షల మంది రైతుల ఖాతాలో రూ. 3870 కోట్లు జమ చేశాం. గత



వైసీపీ ప్రభుత్వంలో రైతులను అన్ని విధాల, ముప్పుతిప్పలు పెట్టారు. రానున్న సీజన్ కోసం కాలువల్లో తూడు, గుర్రపు డెక్క, పూడిక, తవ్వకం పనుల కోసం రూ. 397 కోట్లు కేటాయించి పనులు చేస్తున్నాం' అని మంత్రి రామానాయుడు తెలిపారు.

# మహిళలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత: వంగలపూడి అనిత



**కృష్ణా జిల్లా, మే 10 :** మహిళలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత వ్యాఖ్యానించారు. తల్లుల త్యాగాలను మరవొద్దని పేర్కొన్నారు. అందరికీ మాతృదినోత్సవ శుభా కాంక్షలు తెలిపారు. ఈరోజు (ఆదివారం) కృష్ణా జిల్లా పెనమలూరు మండలం గోశాల వృద్ధ మహిళల ఆశ్రమంలో మదర్స్ డే వేడుకల్లో అనిత, ఎమ్మెల్యే బోడేప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడారు. ఆ ఆశ్రమంలో ఎంతమందోకి ఆశ్రయం కల్పిస్తున్నారని చెప్పుకొచ్చారు. చాలామంది మాతృమూర్తులు వారి పిల్లలకు దూరంగా ఉన్నారని తెలిపారు. వాళ్లకు ఒక చిన్న ఆనందాన్ని ఇవ్వాలని, వాళ్లందరి దీవెనలు పంచుకోవాలని ఈ ఆశ్రమానికి తాను వచ్చానని అన్నారు.

వీళ్లందరి కళ్లలో కనిపిస్తున్న ఆనందం, వాసవి మహిళా మండలి నడుపుతున్న తీరు తనకు చాలా స్ఫూర్తిని ఇచ్చిందని హోంమంత్రి అనిత తెలిపారు. ఈ ఆశ్రమం తమదే అనే భావన వారిలో ఉందని చెప్పుకొచ్చారు. సమాజంలో తల్లికి ఇచ్చే గౌరవస్థానం ప్రపంచంలో ఎవరికీ లేదని వ్యాఖ్యానించారు. దేవుడు కూడా ప్రథమ స్థానాన్ని తల్లికే ఇచ్చారని ప్రస్తావించారు. అలాంటి తల్లులు ఎప్పుడూ ఇబ్బంది పడకూడదని సూచించారు. పిల్లలను కనిపెంచడానికి వాళ్లు ఎన్ని త్యాగాలు చేస్తారో అందరికీ తెలుసునని తెలిపారు. ఒక బిడ్డను కనడానికి తల్లి ఎంతగానో ప్రసవ వేదన పడుతోందని అన్నారు. అలాంటి తల్లులందరికీ ఒక ఆసరాగా నిలబడాల్సిన అవసరం మనందరిపై ఉందని చెప్పుకొచ్చారు. అందుకే ఈరోజు తన పిల్లలిద్దరినీ కూడా తీసుకువచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొనేలా చేశానని తెలిపారు. మహిళల విషయంలో మంత్రి నారా లోకేశ్ చూపుతున్న స్ఫూర్తిని కూడా మనం ఆదర్శంగా తీసుకోవాలని హోంమంత్రి అనిత పేర్కొన్నారు.

సమాజంలో తల్లిని గౌరవించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ తెలిపారు. ఈ ఆశ్రమంలోని తల్లులందరిని ఒకసారి కలిసి వారి ప్రేమను పంచుకోవాలనే ఇక్కడికి వచ్చామని.. వారి కష్టసుఖాలు కూడా విన్నానని చెప్పుకొచ్చారు. ఈరోజు వృద్ధుల ఆశ్రమాలు ఎక్కువగా పెరుగుతున్నాయని.. ఆ అవసరం లేకుండా ప్రతి బిడ్డ కూడా తల్లిని చూసుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు.

# అమ్మకు చెప్పలేని పని ఎప్పుడూ.. ఎవ్వరూ చేయొద్దు: లోకేశ్

**అమరావతి, మే 10:** మదర్స్ డే నేడు. ఈ నేపథ్యంలో తన తల్లి నారా భువనేశ్వరికి ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యా శాఖ మంత్రి, టీడీపీ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేశ్ మదర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం తన ఎక్స్ ఖాతా వేదికగా నారా లోకేశ్ స్పందించారు. ' కనిపించే ప్రతి స్త్రీ.. కని పెంచిన అమ్మతో సమానం. మనల్ని ఈ లోకానికి పరిచయం చేసిన అమ్మకు చెప్పలేని పని ఎప్పుడూ, ఎవ్వరూ చేయొద్దు. ఇదే ప్రతి అమ్మ కోరుకునే కానుక. చిన్నప్పటి నుంచే మహిళలను గౌరవించడం, స్త్రీ పురుషులు సమానం అనే భావన నాలో పెంపొందించింది అమ్మ.

నా తల్లి స్ఫూర్తితోనే విద్యా శాఖలో నైతిక విలువల పాఠాలు ప్రవేశపెట్టాం. మహిళా సాధికారత లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం



మహిళలకు స్త్రీ శక్తి పేరుతో ఉచిత బస్సు ప్రయాణం, దీపం 2 పథకం కింద ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు అందిస్తుంది. బిడ్డలకు గురువు, దైవం, మార్గదర్శి రూపంలో అన్నీ తానైన మాతృమూర్తులందరికీ మదర్స్ డే శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. లవ్ యూ అమ్మా' అని నారా లోకేశ్ పేర్కొన్నారు.

# మహానాడు నిర్వహణ పార్టీకి సంబంధించినది: మంత్రి నారాయణ

**నెల్లూరు, మే 10:** నెల్లూరు జిల్లాలో కోవూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఈ ఏడాది మహానాడు నిర్వహించాలని తెలుగుదేశం పార్టీ అగ్రనాయకత్వం నిర్ణయించింది. దీనిపై వైసీపీ నేతలు విమర్శలు గుప్పిస్తు?న్నారు. వైసీపీ నేతల విమర్శలపై ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ ఆదివారం నెల్లూరులో మండిపడ్డారు. మహానాడు నిర్వహణ పూర్తిగా టీడీపీకి సంబంధించిన విషయమన్నారు. ఏడాదికి మహానాడుని ఒక్కో జిల్లాలో నిర్వహిస్తామని చెప్పారు.గతంలో ఒంగోలు, రాజమండ్రి, విశాఖపట్నం, కడప జిల్లాలో ఈ మహానాడు నిర్వహించారని గుర్తు చేశారు. నెల్లూరులో ఇప్పటి వరకు జరపలేదన్నారు. తమ అభ్యర్థన మేరకు ఈ ఏడాది నెల్లూరులో మహానాడు నిర్వహిస్తున్నారని వివరించారు. దీనిపై ఇతరులు వాఖ్యలు చేయటం హాస్యాస్పదంగా ఉందని చెప్పారు. నెల్లూరు జిల్లాలో మహానాడు



నిర్వహణపై ఆ జిల్లా వైసీపీ అధ్యక్షుడు కాకాణి గోవర్దన్ రెడ్డి విమర్శలు గుప్పించారు.దీనిపై జిల్లాకు చెందిన టీడీపీ నేతలు ఇప్పటికే కాకాణికి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఆ క్రమంలో నెల్లూరు నగర ఎమ్మెల్యే నారాయణ కూడా కాకాణి వ్యాఖ్యలపై స్పందించారు. ఈ ఏడాది నెల్లూరు జిల్లాలో మహానాడు నిర్వహించాలని టీడీపీ నిర్ణయించింది. అందుకు కోవూరు నియోజకవర్గ పరిధిలోని ఇఫ్కో కిసాన్ సెజ్‌లోని ఖాళీ స్థలాన్ని వేదికగా ఎంపిక చేసింది. మే 27 నిర్వహిస్తారు.

# మరో ఐఐటీ.. మరో తెలుగు విద్యార్థి.. ఒక్క రోజు వ్యవధిలో రెండు విషాదాలు..

**అమరావతి, మే 10 :**ఐఐటీ భువనేశ్వర్‌లో ప్రమాదవశాత్తూ బిల్డింగ్ నుంచి కిందపడి తెలుగు విద్యార్థి ప్రాణాలు కోల్పోయారు. గూడురుకు చెందిన నిశాంత్ కుమార్ ఐఐటీ భువనేశ్వర్‌లో పీహెచ్‌డీ చేస్తున్నారు. అయితే ఆదివారం ఉదయం హాస్టల్ బాల్కనీ నుంచి ప్రమాదవశాత్తూ జారిపడి తీవ్రంగా గాయపడ్డారు. తోటి విద్యా ర్థులు గమనించి, ఐఐటీ సిబ్బంది సాయంతో ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే అతను చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.రెండు ప్రముఖ ఐఐటీ విద్యాసంస్థలలో ఒక్క రోజు వ్యవధిలో జరిగిన రెండు వరుస ప్రమాదాలు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఇద్దరు విద్యార్థుల ప్రాణాలను బలితీసుకున్నాయి. ఐఐటీ పట్నాలో క్రికెట్ ఆడుతుండగా కరెంట్ షాక్ కొట్టి హైదరాబాద్‌కు చెందిన విద్యార్థి ప్రాణాలు కోల్పోయిన ఘటన మరువ కముందే.. మరో



ఐఐటీలో ప్రమాదం చోటుచేసుకుంది. ఒడిశాలోని ఐఐటీ భువనేశ్వర్?లో చదువుతున్న ఏపీ విద్యార్థి అనుకోని రీతిలో ప్రాణాలు కోల్పోయాడు. ఏపీలోని గూడూరుకు చెందిన తనికొండ నిశాంత్ కుమార్ .. ఐఐటీ భువనేశ్వర్‌లో పీహెచ్‌డీ చేస్తున్నారు. ఆదివారం రోజు ఉదయం నిశాంత్ కుమార్.. తాను ఉండే హాస్టల్ బాల్కనీ నుంచి జారిపడి తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషయాన్ని గమనించిన తోటి విద్యార్థులు.. ఐఐటీ సిబ్బందికి సమాచారం అందించారు. అనంతరం విద్యార్థులు, ఐఐటీ సిబ్బంది కలిసి నిశాంత్ కుమార్‌ను ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే నిశాంత్ చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు.. వెంటనే ఘటనా స్థలికి చేరుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. మరోవైపు నిశాంత్ కుమార్ చనిపోయిన విషయాన్ని కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. దీంతో అతని కుటుంబం విషాదంలో మునిగిపోయింది.మరోవైపు శనివారం ఉదయం పట్నా ఐఐటీలోనూ ఇలాంటి ఘటనే చోటుచేసుకుంది. ఐఐటీ పట్నాలో హైదరాబాద్‌లోని చందానగర్‌కు చెందిన హర్షిత్ రాజ్ ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ చదువుతుండేవారు. అయితే శనివారం ఉదయం ఆరు గంటల సమయంలో హర్షిత్ రాజ్ క్యాంపస్‌లో క్రికెట్ ఆడుతుండగా ప్రమాదం చోటుచేసుకుంది. క్రికెట్ ఆడుతూ హర్?షిత్ రాజ్ ప్రమాదవశాత్తూ కరెంట్ పోల్ తాకాడు. విద్యుత్ స్తంభానికి కరెంట్ సరఫరా అవుతూ ఉండటంతో హర్షిత్ రాజ్‌కు కరెంట్ షాక్ కొట్టి కుప్పకూలిపోయాడు. అతన్ని వెంటనే నేతాజీ సుభాష్ చంద్రబోస్ మెడికల్ కాలేజీకి లేకపోయింది.

# సిద్ధమైన కృష్ణా జలాల ప్రాజెక్టు.. దశాబ్దాల నిరీక్షణకు తెర, కిడ్నీ బాధితులకు ఊరట



**అమరావతి, మే 10 :**ఎన్టీఆర్ జిల్లా ఎ కొండూరు మండలంలోని కిడ్నీ బాధిత గ్రామాలకు స్వచ్ఛమైన కృష్ణా జలాలను అందించే ప్రాజెక్టు పనులు పూర్తయ్యాయి. సుమారు 15 తండాల్లోని 57 వేల మంది జనాభాకు ప్రతి రోజూ 22 లక్షల లీటర్ల నీటిని అందించేలా కుదప సంపు నుంచి పైప్‌లైన్ నిర్మించారు. గత పదేళ్లుగా కిడ్నీ వ్యాధులతో వందలాది మంది మరణించిన ఈ ప్రాంతంలో.. సురక్షిత నీటి సరఫరా ద్వారా వ్యాధులను అరికట్టడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. ప్రస్తుతం ట్రయల్ రన్ నిర్వహిస్తుండగా.. త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు దీనిని అధికారికంగా ప్రారంభించనున్నారు.ఎన్టీఆర్ జిల్లాలోని ఎ కొండూరు మండలం అంటేనే కిడ్నీ వ్యాధులకు నిలయంగా మారిపోయిన దుస్థితి. ఇక్కడి భూగర్భ జలాల్లో ఉన్న ఫ్లోరైడ్, ఇతర రసాయనాల కారణంగా వందలాది మంది గిరిజనులు కిడ్నీ వ్యాధుల బారిన పడి ప్రాణాలు కోల్పోయారు. ఈ కిడ్నీ మరణాల పరంపరకు అడ్డుకట్ట వేయాలంటే సురక్షితమైన మంచినీటి సరఫరా ఒక్కటే మార్గమని దశాబ్ద కాలంగా బాధితులు మొరపెట్టుకుంటున్నారు. ఎట్టకేలకు ఈ ప్రాంత వాసుల కల నెరవేరుస్తూ.. కృష్ణా నది జలాలను తరలించే ప్రాజెక్టు నిర్మాణాన్ని కూటమి ప్రభుత్వం రికార్డు సమయంలో పూర్తి చేసింది.గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల కాలంలోనే ఈ మండలంలో సుమారు 250 మందికి పైగా కిడ్నీ వ్యాధులతో మరణించారని గణాంకాలు చెబుతున్నాయి.

# విశాఖకు మహర్దశ.. 102 కి.మీ. మేర సెమీ రింగురోడ్డు, మారనున్న రూపురేఖలు


**అమరావతి, మే 10 :**విశాఖ నగరాన్ని రాబోయే 50 ఏళ్ల అవసరాలకు తగ్గట్టుగా అభివృద్ధి చేసేందుకు ఏపీ ప్రభుత్వం మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా రాంబిల్లి నుంచి భోగాపురం వరకు 102 కిలోమీటర్ల మేర సెమీ రింగురోడ్డు నిర్మించనున్నారు. భోగాపురం విమానాశ్రయానికి ఏడు కనెక్టింగ్ రోడ్లు, బీచ్ కారిడార్‌తో పాటు రూ.14 వేల కోట్లతో భారీ తాగునీటి ప్రాజెక్టును చేపట్టనున్నారు. ఉత్తరాంధ్రను ప్రత్యేక అభివృద్ధి జోన్‌గా మారుస్తూ ఆర్థిక కారిడార్‌ను బలోపేతం చేయడమే ఈ ప్రాజెక్టుల ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం చెబుతోంది. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక రాజధానిగా ఎదుగుతున్న విశాఖపట్నం నగరాన్ని రాబోయే 50 ఏళ్ల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రణాళికలను అమలు చేస్తోంది. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ, మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన వీఎంఆర్డీఏ మాస్టర్ ప్లాన్ సమీక్షలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సుమారు 6,836 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న వీఎంఆర్డీఏ పరిధిని మరింత పటిష్టం చేస్తూ.. నగరం నలుమూలలా విస్తరించేలా చర్యలు చేపట్టారు.విశాఖ నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి, పారిశ్రామిక ప్రాంతాలను అనుసంధానించడానికి రాంబిల్లి నుంచి భోగాపురం వరకు 102 కిలోమీటర్ల పొడవైన సెమీ రింగురోడ్డును ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ ఈ నెలాఖరు నాటికి సిద్ధం కానుంది. ఈ రోడ్డు అందుబాటులోకి వస్తే.. నగరం మధ్యలోకి భారీ వాహనాలు రాకుండా నేరుగా హైవేలకు అనుసంధానం అయ్యే అవకాశం ఉంటుంది. దీనివల్ల రవాణా ఖర్చులు తగ్గడమే కాకుండా నగర శివారు ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందుతాయి. నిర్మాణంలో ఉన్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి ప్రాధాన్యతనిస్తూ.. దానికి ఏడు కనెక్టింగ్



రోడ్లను వీఎంఆర్డీఏ నిర్మిస్తోంది. ఇప్పటికే మూడు రోడ్ల నిర్మాణం పూర్తి కాగా.. మిగిలినవి తుది దశలో ఉన్నాయి. విశాఖ నగరం నుంచి భోగాపురం వరకు పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేలా ప్రత్యేక బీచ్ కారిడార్‌ను కూడా ప్రతిపాదించారు. ఇది పర్యాటకులకు సరికొత్త అనుభూతిని అందించడమే కాకుండా సముద్ర తీర ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు దోహదపడుతుంది.నగరవాసుల ప్రాథమిక అవసరాలను తీర్చేందుకు రూ.14 వేల కోట్లతో భారీ తాగునీటి ప్రాజెక్టును ప్రభుత్వం చేపట్టింది. ఈ ప్రాజెక్టు పూర్తయితే విశాఖలోని 95 శాతం ఇళ్లకు స్వచ్ఛమైన తాగునీరు అందుతుందని మంత్రి నారాయణ వివరించారు. అలాగే మాస్టర్ ప్లాన్ విషయంలో స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన 90 శాతం వినతులను అధికారులు పరిష్కరించారు. ఉత్తరాంధ్రను మార్చడమే లక్ష్యంగా..

# దాడుల చరిత్ర జగన్‌ది.. ప్రజాస్వామ్య పాలన చంద్రబాబుది: బుద్దా వెంకన్న

**విజయవాడ, మే 10:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సోషల్ మీడియా పోస్టులు, రాష్ట్ర శాంతిభద్రతలపై చేస్తున్న విమర్శలపై టీడీపీ జాతీయ ఉపాధ్యక్షులు బుద్దా వెంకన్న తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మీడియా స్వేచ్ఛ, పోలీసుల పని తీరు గురించి మాట్లాడే కనీస అర్హత జగన్‌కు లేదని స్పష్టం చేశారు. వైసీపీ సోషల్ మీడియా వికృత చేష్టలకు స్వయంగా జగన్ సోదరి వైఎస్ షర్మిల, వైఎస్ సునీతలే బాధితులని బుద్దా వెంకన్న గుర్తు చేశారు. జగన్‌తో విభేదించినందుకు వైఎస్సార్ బిడ్డ అని కూడా చూడకుండా ఆమె పుట్టుకపై నీచమైన పోస్టులు పెట్టించిన చరిత్ర జగన్‌ది అని విమర్శించారు. నాడు ఆ పోస్టులను సమర్థించి, ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని నీతులు చెబుతున్నారు? అంటూ ధ్వజమెత్తారు.



గడిచిన ఐదేళ్లలో రాష్ట్రాన్ని రావణ కాష్టంగా మార్చి, ప్రజలు ఆర్తనాదాలు చేస్తుంటే తాడేపల్లి ప్యాలెస్‌లో జగన్ పిడేలు వాయించుకున్నారని బుద్దా వెంకన్న ఎద్దేవా చేశారు. పలు బహిరంగ సభల్లో కొడాలి నాని, జోగి రమేష్ వంటి వారు మహిళలపై బూతులతో విరుచుకుపడుతున్నా జగన్ ఆనందించారే తప్ప ఎన్నడూ వారించలేదని విమర్శించారు. మీ దాడులు, దౌర్జన్యాలు భరించలేకే ప్రజలు మీకు 11 సీట్లకే పరిమితం చేశారన్నారు. మాచర్ల దాడుల నుంచి అమాయక కార్యకర్తల హత్యల వరకు జగన్ హయాంలో సుమారు 2,800 మంది టీడీపీ కార్యకర్తలు బలైపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. నేడు అధికారంలో ఉన్నది కూటమి ప్రభుత్వం.. మేము తలచుకుంటే మీరు ఇలా రంకెలు వేసే దమ్ముంటుందా? కానీ, దాడులకు ప్రతి దాడులు ఉండకూడదని చంద్రబాబు మమ్మల్ని ఆపుతున్నారు అని బుద్దా స్పష్టం చేశారు. జగన్ అండతో చట్టాలను ఉల్లంఘించిన ఐపీఎస్ ఆయన గుర్తు చేశారు.

# బుల్లెట్ రైల్ కారిడార్ డిజైన్‌లో మార్పులు.. గంటకు 600 కి.మీ. వేగంతో, ఈ ప్రాంతాల మీదుగానే..

**అమరావతి, మే 10 :**దక్షిణాది రాష్ట్రాలైన తెలంగాణ, ఏపీ, కర్ణాటక, తమిళనాడులను కలుపుతూ మూడు భారీ హైస్పీడ్ రైల్ కారిడార్ల నిర్మాణానికి రైల్వే శాఖ సన్నాహాలు చేస్తోంది. గంటకు 600 కి.మీ. వేగంతో ప్రయాణించే విధంగా వీటి డిజైన్లలో మార్పులు చేయాలని ఎన్‌హెచ్‌ఎస్‌ఆర్‌సీఎల్ ఆదేశించింది. హైదరాబాద్- అమరావతి- చెన్నై, హైదరాబాద్-బెంగళూరు, చెన్నై- బెంగళూరు మార్గాల్లో ఎలైన్‌మెంట్లు ఖరార వుతు న్నాయి. వీటి ద్వారా ప్రయాణ సమయం గణనీయంగా తగ్గడమే కాకుండా పారిశ్రామిక, పర్యాటక రంగాలకు ఊతం లభించనుంది .కేంద్ర రైల్వే శాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హైస్పీడ్ రైల్ కారిడార్ల ప్రాజెక్టును వేగవంతం చేసింది. గతంలో గంటకు 350 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా రూపొందించిన డిజైన్లను ఇప్పుడు గంటకు 600 కిలోమీటర్ల గరిష్ట సామర్థ్యానికి అనుగుణంగా మార్చాలని నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ తాజా ఆదేశాలు జారీ చేసింది. ఈ మార్పులకు అనుగుణంగా అధికా



రులు ఇప్పుడు డీపీఆర్‌లను సిద్ధం చేస్తున్నారు. అయితే డిజైన్ 600 కి.మీ. వేగానికి తట్టుకునేలా ఉన్నప్పటికీ.. ప్రారంభంలో బుల్లెట్ రైళ్లను గరిష్టంగా గంటకు 320 కిలోమీటర్ల వేగంతోనే నడపాలని రైల్వే వర్గాలు నిర్ణయించాయి. ఇది భవిష్యత్తు అవసరాలకు, సాంకేతిక అభివృద్ధికి ముందుగానే సిద్ధంగా ఉండటంలో భాగమని అధికారులు చెబుతున్నారు.

# పెద్ది ట్రైలర్ కు ముహూర్తం ఫిక్స్...
# సౌత్ లో కాదు, నార్త్ లో!



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ జంటగా నటిస్తున్న పాన్-ఇండియా చిత్రం 'పెద్ది'. బుచ్చి బాబు సానా దర్శకత్వంలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఓ కీలక అప్‌డేట్ వెలువడింది. సినిమా ట్రైలర్‌ను మే 16న భోపాల్‌లో అత్యంత వైభవంగా విడుదల చేసేందుకు చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది.

ఈ ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని భారీ ఎత్తున నిర్వహించనున్నారు. హీరో రామ్ చరణ్, హీరోయిన్ జాన్వీ కపూర్‌తో పాటు దర్శకుడు బుచ్చి బాబు, నిర్మాతలు వెంకట సతీష్ కిలారు, సుకుమార్ తదితరులు ఈ వేడుకలో పాల్గొంటారు. ఈ ఈవెంట్‌లో ప్రత్యేక ఆకర్షణగా సంగీత దిగ్గజం ఏఆర్ రెహమాన్ లైవ్ పెర్ఫార్మెన్స్ ఇవ్వనున్నట్టు సమాచారం. ఈ లేటెస్ట్ కబురు సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతోంది.గ్రామీణ నేపథ్యంలో సాగే స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాగా 'పెద్ది' రూపొందుతోంది. ఈ చిత్రంలో రామ్ చరణ్ క్రికెటర్, రెజ్లర్ (పహిల్వాన్) రెండు విభిన్న క్రీడలకు సంబంధించిన పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన 'చికిరి చికిరి' పాట, టీజర్‌లో చరణ్ క్రికెటర్‌గా కనిపించగా, పుట్టినరోజున విడుదల చేసిన 'పెద్ది పహల్వాన్' క్లిప్‌లో ఆయన బాడీ ట్రాన్స్‌ఫర్మేషన్, కుస్తీ లుక్ అందరినీ ఆకట్టుకుంది.

ఈ చిత్రంలో కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్, జగపతి బాబు, బోమన్ ఇరానీ, దివ్యేందు శర్మ కీలక పాత్రలు పోషిస్తున్నారు. శ్రుతి హాసన్‌తో రామ్ చరణ్‌కు ఓ స్పెషల్ సాంగ్ కూడా ఉండనున్నట్టు తెలుస్తోంది. 'పెద్ది' చిత్రం తెలుగు, హిందీ, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా జూన్ 4న విడుదల కానుంది. జూన్ 3న ప్రీమియర్స్ ప్రదర్శించనున్నారు.



# 'ఫిదా'లో 'భానుమతి' పాత్ర కోసం ఆరు నెలల టైమ్ అడిగిన సాయి పల్లవి!

'ఫిదా' సినిమాతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన నటి సాయి పల్లవి. ఆమె పోషించిన భానుమతి పాత్ర ఎంతగా ఆకట్టుకుందో తెలిసిందే. అయితే, ఆ పాత్ర అంతగా పండటం వెనుక ఆమె అంకితభావం, పట్టుదల ఉన్నాయి. దర్శకుడు శేఖర్ కమ్ముల 'ఫిదా' కథతో సంప్రదించినప్పుడు, సాయి పల్లవి జార్జియాలో ఎంబీబీఎస్ చివరి దశలో ఉన్నారు.సినిమా చేయడానికి వెంటనే అంగీకరించినప్పటికీ, తన చదువు పూర్తి చేయడానికి ఆరు నెలల సమయం కావాలని దర్శకుడిని కోరారు. ఆమె నిబద్ధతను అర్థం చేసుకున్న శేఖర్ కమ్ముల అందుకు అంగీకరించారు. 2016లో డిగ్రీ పూర్తి చేసుకుని వచ్చిన సాయి పల్లవి, ఆ తర్వాత 'ఫిదా' కోసం సిద్ధమయ్యారు. తమిళనాడుకు చెందిన ఆమెకు తెలంగాణ యాసలో మాట్లాడటం పెద్ద సవాలుగా మారింది.సాధారణంగా ఇతర భాషా నటీమణులకు డబ్బింగ్ ఆర్టిస్టులు గాత్రదానం చేస్తారు. కానీ, సాయి పల్లవి తన పాత్రకు తానే డబ్బింగ్ చెప్పుకోవాలని నిర్ణయించుకున్నారు. దర్శకుడు శేఖర్ కమ్ముల సహాయంతో తెలంగాణ యాసలోని నుడికారాలను, ఉచ్ఛారణను ఓపికగా నేర్చుకున్నారు. డబ్బింగ్ సమయంలో ఎన్నో తప్పులు చేసినా, పట్టుదలతో మళ్లీ మళ్లీ ప్రయత్నించి భానుమతి పాత్రకు ప్రాణం పోశారు. ఆమె సొంత గొంతుతో పలికిన సంభాషణలకు థియేటర్లలో విశేష స్పందన లభించింది. ఈ డెడికేషనే ఆమెను తెలుగు ప్రేక్షకులకు మరింత చేరువ చేసింది.

# రిలేషన్‌షిప్స్‌పై కొత్త ఫిలాసఫీ

## ఫరియా వ్యాఖ్యలు హాట్ టాపిక్




టాలీవుడ్ లో చిట్టిగా కుర్రాళ్ల మనసు దోచుకున్న ఫరియా అబ్దుల్లా, కేవలం అందంతోనే కాదు తన ఆలోచనలతోనూ అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. రీసెంట్‌గా ప్రేమ, పెళ్లి గురించి ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా రిలేషన్‌షిప్స్ విషయంలో ఫరియా చెప్పిన కొత్త ఫిలాసఫీ విని చిట్టి మామూలు పిల్ల కాదు.. చాలా డెప్త్ ఉంది, అంటూ జనాలు కామెంట్స్ చేస్తున్నారు. ఆమె చెప్పిన ఆ ఆసక్తికర విషయాలేంటో ఇప్పుడు చూద్దాం. ాశ్రీంశీ =ఝుం - ప్రభాస్ ఫ్యాన్స్ షాక్  సప్తగిరి వ్యాఖ్యలపై క్లారిటీ! ప్రేమ వేరు.. పెళ్లి వేరు: చాలామంది ప్రేమ, పెళ్లి రెండూ ఒకటే అనుకుంటారు. కానీ ఫరియా దృష్టిలో ఇవి రెండూ పూర్తిగా వేరు వేరు అంశాలట. "ప్రేమ అనేది ఒక అద్భుతమైన అనుభూతి. మనల్ని ఒకరు ప్రేమిస్తున్నారు అన్న ఆలోచనే మనకి ఎంతో ధైర్యాన్ని, సంతోషాన్ని ఇస్తుంది. కానీ పెళ్లి అనేది ఒక బాధ్యత. ఒక మనిషి తనను తాను పూర్తిగా మార్చుకోవడానికి, కొత్తగా పరిచయం చేసుకోవడానికి పెళ్లి ఉపయోగపడుతుంది" అని ఫరియా తన అభిప్రాయాన్ని పంచుకుంది.

: ప్రస్తుత జనరేషన్ పెళ్లి పట్ల ఆసక్తి కోల్పోతున్న విషయాన్ని ఫరియా చాలా క్లోజ్ గా అబ్జర్వ్ చేస్తోంది. "ఈ కాలం యువత ఆలోచనలు మారుతున్నాయి. భవిష్యత్తులో వివాహం అనే పదానికి అర్థమే మారిపోవచ్చు" అని ఆమె అనడం హాట్ టాపిక్ అయ్యింది. రిలేషన్‌షిప్స్‌ను పెళ్లి అనే ఒక చక్రం లో కాకుండా, సెల్ఫ్ ట్రాన్స్‌ఫార్మేషన్ లాగా చూడటం నిజంగా ఒక కొత్త పాయింట్ ఆఫ్ వ్యూ. మల్టీ టాలెంటెడ్ మాయమ్మ: ఇక కేవలం నటనకే పరిమితం కాకుండా ఫరియా తనలోని ఇతర కోణాలను కూడా బయటపెడుతోంది. రీసెంట్ గా 'జెట్లీ' సినిమాకు డబ్బింగ్ చెప్పింది, అలాగే 'మత్తు వదలరా-2'లో ఒక పాటకు లిరిక్స్ రాసి కొరియోగ్రఫీ కూడా చేసింది. అంతేకాదు, డైరెక్షన్ మీద ఉన్న ఇష్టంతో వచ్చే ఏడాది నుండే మెగా ఫోన్ పట్టేందుకు ట్రయల్స్ మొదలుపెడతానని హింట్ ఇచ్చింది. ఇక ఫరియాలోని ఈ ఆల్ రౌండర్ టాలెంట్ చూసి ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు.

# భారీ కామెడీ ఎంటర్‌టైనర్





ఒకప్పుడు బ్లాక్‌బస్టర్ కామెడీ ఎంటర్‌టైనర్లతో ప్రేక్షకులను అలరించిన డైరెక్టర్ శ్రీను వైట్ల ఇప్పుడు మళ్లీ తన వింటేజ్ స్టైల్‌లో బలమైన కమ్‌బ్యాక్‌కు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. యంగ్ హీరో శర్వానంద్‌తో ఆయన ఓ భారీ కామెడీ ఎంటర్‌టైనర్‌ను తెరకెక్కించబోతున్నారని సమాచారం. అయితే మొదట ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించనున్నట్లు వార్తలు వచ్చినప్పటికీ, కొన్ని అనివార్య కారణాల వల్ల వారు ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నారట. దీంతో నిర్మాత అనిల్ సుంకర ఈ సినిమాను టేకప్ చేసినట్లు సమాచారం. ఇప్పటికే కథ, స్క్రీన్‌ప్లే పనులు పూర్తయిన ఈ సినిమాను శ్రీను వైట్ల పూర్తిస్థాయి కామెడీ ఎంటర్‌టైనర్‌గా తీర్చిదిద్దుతున్నారట. తన కెరీర్‌లో బిగ్గెస్ట్ హిట్స్‌గా నిలిచిన దూకుడు, రెడీ, కింగ్ తరహా వినోదాన్ని మళ్లీ తెరపైకి తీసుకురావాలనే ఆలోచనలో శ్రీను వైట్ల ఉన్నారట. శర్వానంద్ కామెడీ టైమింగ్, ఎమోషనల్ పర్ఫార్మెన్స్ రెండింటినీ బాగా ఉపయోగించేలా స్క్రిప్ట్‌ను డిజైన్ చేశారని తెలిసింది. ఈ సినిమాతో శర్వానంద్‌కు పూర్తి కమర్షియల్ కామెడీ హిట్ ఇవ్వాలని డైరెక్టర్ బలంగా ఫోకస్ చేస్తున్నారట.

# నితిన్ సైన్స్ ఫిక్షన్ మూవీ..
## ఇప్పట్లో కష్టమేనా?



టాలీవుడ్ యంగ్ హీరో నితిన్ ఒకప్పుడు వరుస విజయాలతో మంచి మార్కెట్ సంపాదించినా.. గత కొన్నేళ్లుగా మాత్రం సరైన హిట్ కోసం ఎదురుచూస్తున్నారు. భీష్మ తర్వాత ఆ రేంజ్ హిట్ ను అందుకోలేకపోయిన నితిన్.. వరుసగా సినిమాలు చేస్తున్నా బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాలు రావడం లేదు. ముఖ్యంగా గతేడాది విడుదలైన రాబిన్ హుడ్, తమ్ముడు సినిమాలపై అభిమానుల్లో మంచి అంచనాలు ఉన్నా.. రెండూ నిరాశపరిచాయి. ఇలాంటి పరిస్థితుల్లో నితిన్ కొత్త ప్రాజెక్టుల ఎంపికలో జాగ్రత్తగా ముందుకెళ్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆయన సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ లో ఓ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. నారి సిరిసవాడ, టి సోమశేఖర్ ఆ మూవీకి దర్శకత్వం వహిస్తున్నారు. ఆయ్ సినిమా ఫేమ్ అంజి కె. మణిపుత్ర చెప్పిన కథ నచ్చడంతో ఆ ప్రాజెక్ట్ ను కూడా ముందుకు తీసుకెళ్లాలని నితిన్ భావిస్తున్నారట.

అయితే నాగవంశీ తన సినిమాను వీలైనంత త్వరగా పూర్తి చేసి విడుదల చేయాలనే ప్లాన్ లో ఉన్నారని తెలుస్తోంది. ఇదిలా ఉంటే దర్శకుడు వీఐ ఆనంద్ తో నితిన్ చేయాల్సిన సైన్స్ ఫిక్షన్ మూవీపై మాత్రం అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మొదట ఆ ప్రాజెక్ట్ పై మంచి హైప్ ఏర్పడింది. ఎక్కడికి పోతావు చిన్నవాడా, ఒక్కక్షణం, ఊరు పేరు భైరవకోన లాంటి విభిన్న కథలతో గుర్తింపు తెచ్చుకున్న వీఐ ఆనంద్.. నితిన్ కోసం కూడా ఓ కొత్త కాన్సెప్ట్ సిద్ధం చేసినట్లు ప్రచారం జరిగింది

ఆ సినిమా సైన్స్ ఫిక్షన్ జానర్ లో తెరకెక్కనుందని, అన్నదమ్ముల నేపథ్యంతో కథ సాగుతుందని సమాచారం. అంతేకాదు ఇందులో నితిన్ డ్యూయల్ రోల్ చేయనున్నారని కూడా టాక్ వినిపిస్తోంది. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత నితిన్ మరోసారి డ్యూయల్ రోల్ లో కనిపించే అవకాశం ఉండటంతో అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. గతంలో ఆయన చేసిన అల్లరి బుల్లోడులో డబుల్ రోల్ కనిపించినా.. ఆ సినిమా ఆశించిన ఫలితం ఇవ్వలేదు. అయితే ఇప్పుడు ఆ సైన్స్ ఫిక్షన్ ప్రాజెక్ట్ ముందుకు సాగడంలో ప్రధాన అడ్డంకి బడ్జెట్ గా మారినట్లు తెలుస్తోంది. సైన్స్ ఫిక్షన్ కథ కావడంతో భారీ వ్యయంతో తెరకెక్కించాల్సిన పరిస్థితి ఉందట. కానీ వరుస ఫ్లాపుల కారణంగా ప్రస్తుతం నితిన్ మార్కెట్ కొంత తగ్గిందనే అభిప్రాయం వినిపిస్తోంది. దీంతో నిర్మాతలు భారీగా పెట్టుబడులు పెట్టేందుకు కాస్త వెనకడుగు వేస్తున్నారని సమాచారం.

అంతేకాదు కథలో కొన్ని మార్పులు చేయాలని నిర్మాత సూచించారని, ముఖ్యంగా సెకండాఫ్ విషయంలో సందేహాలు వ్యక్తమయ్యాయని టాక్. ఖర్చు తగ్గించేలా మార్పులు చేయాలని కోరినా.. దర్శకుడు వీఐ ఆనంద్ తన అసలు విజన్ ను మార్చేందుకు అంతగా ఆసక్తి చూపలేదని ప్రచారం జరుగుతోంది. దీంతో ఆ ప్రాజెక్టు ప్రస్తుతం తాత్కాలికంగా పక్కకు వెళ్లినట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో నితిన్ వివిధ సినిమాలతో బిజీ కావడంతో.. వీఐ ఆనంద్ అదే కథను మరో హీరోకు వినిపించే ప్రయత్నంలో ఉన్నారనే వార్తలు కూడా వినిపిస్తున్నాయి. అదే సమయంలో నితిన్ మాత్రం ముందుగా సితార బ్యానర్ సినిమా ద్వారా స్ట్రాంగ్ కమ్ బ్యాక్ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ఆ సినిమా విజయం సాధిస్తే ఆయన మార్కెట్ మళ్లీ బలపడే అవకాశం ఉంది. అప్పుడు వీఐ ఆనంద్ తో సైన్స్ ఫిక్షన్ ప్రాజెక్ట్ తిరిగి పట్టాలెక్కే ఛాన్స్ ఉందని అభిమానులు ఆశిస్తున్నారు. అదే నిజమైతే ఇప్పట్లో ఆ సినిమా సెట్స్ పైకి వెళ్లడం కష్టమేనేమో! మరేం జరుగుతుందో వేచి చూడాలి.

# కళారాధన ఉచిత లలిత కళల వేసవి శిక్షణా శిబిరం ఘనంగా ప్రారంభం

**. జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన కళారాధన అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ మధుసూదనరావు, డాక్టర్ రవి కృష్ణ.**

**. 20 అంశాలలో, 32 మంది శిక్షకులతో నెలరోజుల పాటు ఉచిత శిక్షణ శిబిరం. -. జూన్ రెండవ తేదీ ముగింపు ఉత్సవం**

**నంద్యాల మే 10( రిపబ్లిక్ న్యూస్) :** కళారాధన సాంస్కృతిక సంస్థ నంద్యాల ఆధ్వర్యంలో, నంద్యాల ఐఎంఏ, మహిళా వైద్య విభాగం, నంద్యాల లయన్స్ క్లబ్ సంయుక్త సహకారంతో నిర్వహిస్తున్న ఉచిత లలిత కళలు,క్రీడల వేసవి శిక్షణా శిబిరాన్ని స్థానిక కేఎన్ఎం పురపాలక పాఠశాల ఆవరణలో కళారాధన అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ మధుసూదనరావు, డాక్టర్ రవి కృష్ణ, ఆంధ్రప్రదేశ్ లయన్స్ క్లబ్ ల సమాఖ్య మాజీ చైర్మన్ ఏ. వి.ఆర్. ప్రసాద్, కే.ఎన్.ఎం. పాఠశాల ప్రధానోపాధ్యాయులు అసదుల్లా కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి లాంఛనంగా ప్రారంభించారు. కళారాధన అధ్యక్షులు డాక్టర్ మధుసూదనరావు అధ్యక్షతన, ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవి కృష్ణ, కార్య నిర్వాహక కార్యదర్శులు అన్నెం శ్రీనివాసరెడ్డి ,పత్తి రంగనాథ్, సాహితీ విభాగం కార్యదర్శి డాక్టర్ నీలం వెంకటేశ్వర్లు నిర్వహణలో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో

కళారాధన అధ్యక్షులు డాక్టర్ మధుసూదన్ రావు మాట్లాడుతూ ఈ సంవత్సరం మే 1వ తేదీ నుండి జూన్ 2 వ తేదీ వరకు “కళా సాధన- 2026“ వేసవి శిబిరం



జిల్లాస్థాయి చెస్ పోటీలు ప్రారంభిస్తున్న డాక్టర్ రామకృష్ణ రెడ్డి

నిర్వహించడం జరుగుతున్నదని, ఈరోజు లాంఛనంగా ప్రారంభించామన్నారు. వేసవి సెలవులను బాలలు, యువత సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ఏవిఆర్ ప్రసాద్ మాట్లాడుతూ కళలు, క్రీడలు బాలల మానసిక, వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేస్తాయని తద్వారా చదువులో కూడా రాణించడానికి అవకాశాలు మెరుగవుతాయని అన్నారు. క్రమ శిక్షణ, ఏకాగ్రత మెరుగవుతాయని అన్నారు.

ప్రధానోపాధ్యాయులు అసదుల్లా మాట్లాడుతూ కళారాధన గత 25 సంవత్సరాలుగా క్రమం తప్పకుండా ఇంత చక్కటి కార్యక్రమం ఒక కళాయజ్ఞంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. బాలలకు వేసవి సెలవులు సద్వినియోగం చేసుకోవడానికి ఇది ఒక గొప్ప అవకాశం అన్నారు. డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ శిక్షణ పొందిన బాలబాలికల చేత శిబిరం ముగింపు కార్యక్రమంలో ప్రదర్శనలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. శిబిరంలో పాల్గొన్న అందరికీ ప్రశంసా పత్రం అందజేస్తామన్నారు. శిబిరంలో శిక్షణ పొందడానికి, ముగింపు ఉత్సవంలో ప్రదర్శనలు ఇవ్వడానికి ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరంలేదని తెలిపారు. ప్రదర్శనలకు అవసరమైనటువంటి కాస్ట్యూమ్స్, మేకప్ , లైటింగ్ సౌండ్ సిస్టం ఏర్పాట్లు అన్ని కూడా కళారాధన ఆధ్వర్యంలో చేస్తామన్నారు. కోచ్ లకు గౌరవ పారితోషికం అందజేస్తామన్నారు. కోచ్ లకు ప్రతిరోజు అల్పాహారం ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ సమావేశంలో కలయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేసుల నాగరాజు, క్యాంప్ కోఆర్డినేటర్ లు మజీద్, వెంకటేశ్వర్లు ,కోచ్ లు గణేష్ ,కళ్యాణి, లలితా సరస్వతి, సుహాసిని, ప్రజ్వల, మానస,రజాక్ బాలరాజు,, శివకుమార్,సుదర్శనం,బాలకృష్ణ,నాగేంద్ర,ం ాజేంద్ర, సతీష్ ,మధు,సీతారాం, వెంకటరాజు, రాజ్ కుమార్, తరుణ్,నిలయ్, సాయి,సత్యనారాయణ, దామోదర్,సమీర్, ఫణి, శిక్షణ పొందుతున్న 350 మంది బాలబాలికలు, యువత, బాలల తల్లితండ్రులు పాల్గొన్నారు.

# ఒకప్పుడు సౌకర్యాల లేమి

## - ఇప్పుడు సకల సౌకర్యాల అడ్డాగా రూపాంతరం చెందిన బేతంచెర్ల కొత్త బస్టాండ్!

**బేతంచర్ల ప్రతినిధి, మే 10(రిపబ్లిక్ న్యూస్)**



2019 కి ముందు బేతంచెర్ల నగర ప్రజలు కొత్త బస్టాండ్ లో సరి అయిన వసతులు లేక నానా ఇబ్బందులు పడ్డారు.వర్షం వస్తే గుంతలలో నీళు ఆగడం తద్వారా దోమల బెడదతో అలమటించేవారు.అంతేకాదు ప్రయాణికులు కాసేపు నడుం వాల్చడానికి బల్లలు,కూర్చోవడానికి కుర్చీలు లేకపోవడం,ఇక ఫ్యాన్ సౌకర్యం సైతం లేక ప్రయాణికులకు గాలి ఆడని పరిస్థితి ఉత్పన్నం అయ్యి వారంతా నరకం చూసేవారు,ఇక టాయిలెట్ సౌకర్యం కూడా అంతంత మటుకే,ఇలా బేతంచెర్ల ప్రజలు కొత్త బస్టాండ్ కు వస్తే చాలు ఏ మాత్రం వసతులు లేని పరిస్థితులు వారందరి కళ్ళ ముందు సాక్షాత్కారించేవి.అయితే ఎప్పుడైతే మన జననేత వైఎస్ జగనన్న సారథ్యంలోని వైస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో మన ప్రియతమ నాయకుడు మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి అన్నయ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థికమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టాడో ఇక అక్కడి నుంచి ఆయన ఎంతో ముందు చూపుతో బేతంచెర్ల కొత్త బస్టాండ్ రూపురేఖలే మారిపోయేలా అభివృద్ధికి పెద్ద పీట వేశాడు అనే మాట అక్షర సత్యం. ఎందుకంటే బుగ్గన రాజారెడ్డి అన్నయ్య ప్రత్యేక చొరవ చూపి కొత్త బస్టాండ్ అభివృద్ధికి ఒక కోటి 30 లక్షల నిధులు రాబట్టి మరీ బేతంచెర్ల కొత్త బస్టాండ్ సకల సౌకర్యాల అడ్డగా అంటే కొత్త బస్టాండ్ ప్రాంగణంలో సీసీ రోడ్డు సౌకర్యం కల్పించడం,ప్రయాణికులకు మంచి నాణ్యమైన టాయిలెట్ల సౌకర్యం కల్పించడం,లైటింగ్ వ్యవస్థను అభివృద్ధి పరచడం,త్రాగునీటిని అందుబాటులోకి తేవడం,ప్రయాణికులు సేద తీరెందుకు కుర్చీలు,బల్లలు ఏర్పాటు చేయడం.ఇలా తన వంతుగా 2019 - 2024 మధ్యకాలంలో బేతంచెర్ల కొత్త బస్టాండ్ అభివృద్ధిని చూసి ప్రతి ఒక్క ప్రజానీకం శెభాష్ అనేలా తీర్చిదిద్దిన ఘనత ముమ్మాటికీ మన ప్రియతమ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ఆర్థిక శాఖమాత్యులు బుగ్గన రాజేంద్రనాథరెడ్డి అన్నయ్యకు దక్కుతుంది అనడంలో ఎలాంటి సందేహానికి తావు లేదు

# నంద్యాల పట్టణంలో విస్తృత తనిఖీలు

**అడిషనల్ సూపరింటెండెంట్ జావళి**

**నంద్యాల క్రైం, మే 10, (రిపబ్లిక్ న్యూస్):** జిల్లావ్యాప్తంగా నేర నియంతరణ,చట్ట వ్యతిరేక కార్యకలాపాలను అరికట్టేందుకు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా నిరోధించేందుకు, ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకు విస్తృతంగా విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలన్న జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాల మేరకు నంద్యాల సబ్ డివిజన్ అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎం.జావళి ఆల్ఫోన్స్ నంద్యాల పట్టణ కేంద్రంలో ఆదివారం విస్తృతంగా విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నంద్యాల వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ముఖ్యమైన ప్రాంతాలలో సంబంధిత అధికారులతో విజిబుల్





పోలీసింగ్ నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా ఆర్టీసీ బస్ స్టాండ్,అంజుమన్ మసీద్, విక్టోరియా రీడింగ్ రూమ్, సంజీవనగర్ గేట్, ప్రాంతాలలో, రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా నిబంధనలు ఉల్లంఘించి మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వాహనాలను స్వాధీనం చేసుకొని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించడం జరిగింది. అనంతరం పట్టణ కేంద్రంలో గల పలు లాడ్జ్ లు,డార్మెటరీ తనిఖీ చేయడంతో పాటు, బస్ స్టాండ్ లోని నేరాల నియంత్రణకు అనుమానితులపై ప్రత్యేక నిఘా ఉంచి విస్తృతంగా తనిఖీలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ ఇన్స్పెక్టర్ సుధాకర్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

# గుండెపోటుతో వ్యక్తి మృతి

**చౌడేపల్లి ప్రతినిధి మే 10 రిపబ్లిక్ న్యూస్**



ఉదయాన్నే క్రికెట్ ఆడి ఆట ముగించుకుని ఇంటికి వచ్చిన వ్యక్తి గుండెపోటుతో మృతి చెందిన సంఘటన ఆదివారం చౌడేపల్లి మండలంలో చోటుచేసుకుంది కుటుంబ సభ్యుల కథనం మేరకు... మండలంలోని పరికిదొన పంచాయతీ ఎగువ గాజుల వారి పల్లికి చెందిన వెంకటేష్ 29 ఆదివారం ఉదయం గ్రామానికి సమీపంలోని పొలంలో స్నేహితులతో క్రికెట్ ఆడి ఇంటికి వచ్చాడు ఇంట్లో భోజనం చేసిన తర్వాత ఛాతి నొప్పి అని కుటుంబ సభ్యులకు తెలిపాడు దీంతో చౌడేపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు ఇక్కడ చికిత్స పొందుతూ మరణించినట్లు వైద్యులు దృవీకరించారు అయితే ఇంటికి తీసుకు వెళ్లిపోయిన తర్వాత వెంకటేష్ , బ్రతికున్నాడని నమ్మకంతో వెంటనే మదనపల్లి ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు అయితే అప్పటికే పూర్తి చేసినట్లు వైద్యులు ధ్రువీకరించారు తొలత మరణించాడని తర్వాత బ్రతికే ఉన్నాడన్న ఆశతో మదనపల్లికి తరలించగా అక్కడ నిరాశ 5 రావడంతో గ్రామంలో ఒక్కసారిగా విషాదఛాయలు అలుముకున్నాయి.

# మహిళల భద్రతే లక్ష్యంగా అవగాహన

**శక్తి యాప్, సైబర్ క్రైమ్, మహిళల భద్రత, కొత్త చట్టాలపై అవగాహన కల్పించిన పోలీసు అధికారులు**



**నంద్యాల క్రైం, మే 10, (రిపబ్లిక్ న్యూస్):**



తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలోని చాపిరేవుల గ్రామం నందు ఆదివారం ఏర్పాటు చేసినటువంటి మహిళల హక్కులు, మహిళల భద్రత, సైబర్ క్రైమ్, బాల్యవివాహాలు, ఫోక్సో చట్టాలు, ప్రస్తుతం జరుగుతున్న నేరాలపై శక్తి టీం బృందం, ఇన్స్పెక్టర్ జయరాం, తాలూకా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఈశ్వరయ్య, ఎస్ఐ, పోలీసు సిబ్బంది సహాయంతో అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మహిళలకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పిస్తూ, శక్తి యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని వాటి ప్రయోజనాలపై క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు నియంత్రించాలంటే ముఖ్యంగా వ్యక్తిగత నియంతరణ పాటించాలని, ప్రభుత్వ అధికారులు ఎవరూ ఫోన్ చేసి డబ్బులు అడగరని ఒకవేళ అలా జరుగుతే అది సైబర్ నేరమని గ్రహించి వెంటనే పోలీసులను సంప్రదించాలని తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తుల నుండి వచ్చే ఫోన్ కాల్స్ అనుమానాస్పద మెసేజ్, లింక్ ల పై అప్రమత్తంగా ఉండాలని ఎవరైనా సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే వెంటనే 1930 నంబర్ కు గాని, మీ దగ్గరలోని పోలీస్ స్టేషన్కు గాని లేదా జిల్లా హెడ్ క్వార్టర్ నందు గల సైబర్ క్రైమ్ ఆఫీసును గాని సంప్రదించి సహాయం పొందవచ్చును అన్నారు. బాల్య వివాహాలు నేరమని బాల్యవివాహాలు చేయుట ద్వారా అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఏదైనా అత్యవసర సమయంలో ఉపయోగించవలసిన పోలీసు హెల్ప్ లైన్ నెంబర్ 112 గాని లేదా 100 ఫోన్ చేసి సహాయం పొందవచ్చును అన్నారు. మహిళల రక్షణ కొరకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సఖి వన్ స్టాప్ సెంటర్ లపై కూడా అవగాహన కల్పిస్తూ మహిళలు ఏదైనా అవసరం నిమిత్తము జిల్లా హెడ్ క్వార్టర్ కు వచ్చినప్పుడు మీరు ఊరికి పోలేని సమయంలో వన్ స్టాప్ సెంటరులను ఉపయోగించగలరని అవగాహన కల్పించడం జరిగినది.

# విద్యార్థులలో తెలుగుపై మక్కువ పెంచడం ఎలా

**న్యూక్లియస్ కళాశాలలో ఘనంగా “తెలుగు సాహితీ సదస్సు“ -ఉగాది పురస్కార గ్రహీత డాక్టర్ రమణమూర్తికి సత్కారం...**

**నంద్యాల మే 10( రిపబ్లిక్ న్యూస్) :** “విద్యార్థులలో తెలుగుపై మక్కువ పెంచడం ఎలా“ అనే అంశం పై ఆదివారం నంద్యాల న్యూక్లియస్ జూనియర్ కళాశాలలో చర్చా గోష్టి నిర్వహించారు. తెలుగు ఉపాధ్యాయులు, మాతృభాషా పరిరక్షణ సమితి కార్యదర్శి అన్నెం శ్రీనివాసరెడ్డి ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ కార్యక్రమం కళాశాల కరస్పాండెంట్ సోము మురళీధర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా 2026 ఉగాది పురస్కార గ్రహీత డాక్టర్ వైష్ణవ వెంకటరమణమూర్తి పాల్గొన్నారు. నంద్యాల పట్టణానికి చెందిన అనేకమంది ప్రముఖ ఉపాధ్యాయులు , తెలుగు రచయితలు ఈ కార్యక్రమంలో పాల్గొని తెలుగు మనుగడ కోసం, విద్యార్థులు తెలుగును ఆస్వాదించడం కోసం ఏమి చేయాలో సూచనలు సలహాల ద్వారా వినిపించారు. ఈ సందర్భంగా సాహితీ స్రవంతి కార్యదర్శి డాక్టర్ నీలం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. విద్యార్థులకు జానపదాలు, కోలాటం వంటివి నేర్పించాలని, విద్యార్థులను కథలు రాసే విధంగా ప్రోత్సహించాలని, అభిప్రాయపడ్డారు. తెలుగు ఉపాధ్యాయుడు రిసోర్స్ పర్సన్ ఎద్దు ప్రసాదు మాట్లాడుతూ విద్యార్థులు చదివే గ్రూపులతో సంబంధం లేకుండా తెలుగు వాతావరణాన్ని విద్యాలయాల్లో సృష్టించాలని అది విద్యార్థులపై అధిక ప్రభావం చూపుతుందని అభిప్రాయపడ్డారు. బీఈడీ కళాశాల అధ్యాపకులు రచయిత మహమ్మద్ రఫీ మాట్లాడుతూ తెలుగు మాధ్యమ పాఠశాలలను ప్రత్యేకంగా నెలకొల్పాలని, చలనచిత్రాలలో తెలుగు సంస్కృతి ప్రతిబింబించాలని అభిప్రాయపడ్డారు. గుడ్ షెఫర్డ్ పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు రవికుమార్ మాట్లాడుతూ సోషల్ మీడియాలో తెలుగుకు ప్రాధాన్యం ఉండాలని, వక్తృత్వ పోటీలు, వ్యాసరచన పోటీలు విద్యార్థులకు నిర్వహించాలని, విద్యాలయాల్లో తెలుగు పుస్తకాలతో కూడిన గ్రంధాలయాలను ఏర్పాటు చేయాలని అభిప్రాయపడ్డారు. విశ్రాంత ఉపాధ్యాయులు రచయిత నీలకంఠమాచారి మాట్లాడుతూ విద్యార్థులలో శక్తి సామర్ధ్యాలను వృధా కానివ్వకుండా తెలుగు భాష వైపు మళ్ళించాలని, విద్యార్థులను ఉపాధ్యాయుడు తన తెలుగు



వాక్చాతుర్యంతో ఆకర్షించాలని అభిప్రాయపడ్డారు. నంద్యాలకు చెందిన ప్రముఖ అవధాని డాక్టర్ గంగుల నాగరాజు మాట్లాడుతూ విద్యాసంస్థలలో ప్రతినెల సాహితీ సంబంధ కార్యక్రమాలు నిర్వహించాలని, తెలుగును రసభరితంగా బోధించాలని, అనేక సబ్జెక్టులు చదివి అలసిన విద్యార్థికి తెలుగు ఆటవిడుపు కావాలని, తెలుగు పాఠం ద్వారా విద్యార్థులు నూతనోత్సాహం నింపుకోగలగాలని అభిప్రాయపడ్డారు. ఉపాధ్యాయులు తెలుగు రచయిత అయిన మాబు బాషా గారు మాట్లాడుతూ యునెస్కో వారు అంతరించిన భాషల డేటా ప్రకారం తెలుగు కూడా త్వరలో అంతరించిపోయే భాష అని పేర్కొన్నారు గాని ఇంట్లో తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు తెలుగులో మాత్రమే మాట్లాడుతూ, వ్రాయడానికి కూడా తెలుగునే ఎంచుకోగలిగితే తెలుగు శాశ్వతమైన భాషగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. తెలుగు ఉపాధ్యాయులు రచయిత రిసోర్స్ పర్సన్ నరేంద్ర మాట్లాడుతూ తెలుగు భాషకు సంబంధించిన ప్రముఖ వ్యక్తుల జయంతి, వర్ధంతులను నిర్వహించి వారి ప్రత్యేకతను విద్యార్థులకు వివరించాలని అభిప్రాయపడ్డారు. సామాన్య శాస్త్ర ఉపాధ్యాయులు జన విజ్ఞాన వేదిక సభ్యులు రమణ మాట్లాడుతూ తెలుగు భాష ఉన్నతి కోసం సాంకేతికతను వాడాలని, పద్యాలు పాటలను లయబద్ధంగా విద్యార్థులు పాడటాన్ని అలవాటు చేయాలని, తెలుగు కు సంబంధించిన పోటీలు, విద్యార్థులకు తరచు నిర్వహించాలని అభిప్రాయపడ్డారు. అనంతరం ముఖ్యఅతిథి డా.రమణమూర్తి గారికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తనకు లభించే పురస్కారం తెలుగు లభించిన పురస్కారం గా చూడాలన్నారు. నంద్యాలకు చెందిన కవులందరూ వారు వారి రచనలను పుస్తక రూపంలోకి తెచ్చినప్పుడే నంద్యాల ఘనత ఇతరులకు తెలుస్తుందని అభిప్రాయపడ్డారు. 74 సంవత్సరాల వయసులో అనారోగ్యంతో శరీరం సన్నబడింది కానీ నా పద్యం సన్న పడలేదని చమత్కరించారు. శ్రోతలను ఆకట్టుకునే విధంగా పద్యం తప్పులేకుండా రాగయుక్తంగా చదవగలిగితే తెలుగు అజరామరంగా వెలుగు అందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో రచయిత , కళాశాల తెలుగు అధ్యాపకులు కొప్పుల ప్రసాదు, కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ డైరెక్టర్ వాసుదేవ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ సోము మురళీధర్ రెడ్డి గారు మాట్లాడుతూ తెలుగు ఉన్నతి కోసం ఆర్థికంగా సహాయం చేయడానికి, తమ కళాశాలను వేదికగా ఇవ్వడానికైనా న్యూక్లియస్ కళాశాల ఎప్పుడూ సిద్ధమేనని పేర్కొన్నారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com